# వేటగాళ్ళు

## (ఆంగ్లరాజ్య కథ)

సర్ జేమ్స్ మెక్ లారెన్, లేడీ లిడియా మెక్ లారెన్‌తో సహా మా రోల్స్ రాయిస్ కారులో, ఫుల్ ఎస్కార్ట్‌తో మా కోట సింహద్వారం దగ్గర దిగినప్పుడే ఏదో కొంప మునిగే ఉపద్రవం కాబోతున్నదని నేను గ్రహించాను.

అసలే వేసవి రోజులు. మే నెల మధ్య భాగం. ఏం జరుగుతుందో అన్న సస్పెన్స్‌తో నా బుర్ర వేడెక్కింది.

నేను యువరాజ్ కుమార్ అమరేంద్ర సింగ్ ఆఫ్ నిశాపూర్.

వెయ్యేళ్ళ చరిత్ర వున్న సంస్థానం మాది.

ఎలాంటి చరిత్ర అన్నది వేరే పెద్ద ప్రశ్న.

మా కోటలో ఎన్నో శతాబ్దాలుగా మా ప్రాపకంలో బ్రతికే పండితులు రాసిన మా పూర్వీకుల చరిత్రలు మినహా మరే విధమైన ప్రామాణిక గ్రంథాలూ లేవు. ఆ చరిత్రలు చదివితే అందులో నమ్మదగ్గ విషయాలు ఏమీ లేవని ఏమాత్రం కామన్సెన్స్ వున్న వారికైనా ఇట్టే అర్థమైపోతుంది. మా ఆస్థాన పండితుల దృష్టిలో మా చరిత్ర అంటే మా వంశీకులు చేసిన ఘనకార్యాలను- మంచినీ, చెడునూ- అన్నింటినీ చక్కని భాషలో పద్యాల రూపంలో, శతకాలలో, కావ్యాలలో వర్ణించి మసిబూసి మెరిసే మారేడు కాయలుగా చేసి అసలేం జరిగిందో అరిచ్చచ్చినా తెలియకుండా చేయడంలో మా ఆస్థాన పండితులు సఫలీకృతం అయ్యారు. అతిశయోక్తి, ఉత్ప్రేక్ష ఇంకా ఇలాంటివే ఇతర అలంకార విశేషాలను పుష్కలంగా వాడి మేము అసలు మనుషులం కాదు .. ఎవరో దేవుళ్ళ తాలూకు అవతారాలమనే నమ్మకం ప్రజలలో కలగాలనే సద్బుద్ధితో మా పూర్వీకుల చరిత్రలు రాయడం జరిగింది. బహుశా రాయక తప్పలేదేమో వారికి. మరి ప్రభువుల ప్రాపకం కావాలంటే మరో మార్గమేముంది?

కాని మా సంస్థానం ప్రజలు తెలివైన వారు.


వాళ్ళు అంత తేలికగా ఏదీ నమ్మరని నాకు క్రమేపీ అర్థమయింది.

మా వంశీకుల్లో వొకాయన నల్లగా పొట్టిగా మరుగుజ్జులా కురూపిగా వుండేవాడట. దానికి తోడు పెద్ద తల, కాని ఆయన చరిత్ర మనం చదివితే ఆయన ఏ మన్మథుడో, నలకూబరుడో అనుకునేలా వర్ణించిపెట్టారు మా వంశీయుల చరిత్రకారులు. క్లాసికల్ ప్రపోర్షన్స్‌లో వుండే సుందరాంగుడిలా వర్ణించి, ప్రక్క ఎస్టేట్స్‌మీద అతగాడు అధర్మ యుద్ధాలు చేసినప్పటికీ... తన రాజ్య ప్రజలను పీడించినప్పటికీ, ఆ చరిత్ర పుటలు చదివితే... అందమైన రాజు, ప్రజా సంక్షేమం కోసమే ఇవన్నీ చేశాడనే వూహ వచ్చేలా రాశారు. ప్రజలంటే అతడికి ప్రాణ సమానమనీ, ఇతర రాజులు క్రూరంగా తమ ప్రజలను వేధిస్తుంటే దీనులైన ఆ ప్రజలను రక్షించాలనే సదుద్దేశంతో ఈయనగారు ఆ రాజ్యాల మీదకి దండెత్తి ఆ ప్రజలను కాపాడి తమ ధర్మ పాలనలో వోలలాడించాడని ఆ చరిత్రలు ఘోషించాయి.

అవన్నీ అబద్ధాలని ప్రజలకే తెలుసు. అయినా ఆ చరిత్రలెవరికి కావాలి? ఎవరు చదువుతారా అబద్ధాల పుట్టలు? మాకు తప్ప మరెవరికి కావాలీ కట్టుకథలు?

వెయ్యేళ్ళ చరిత్ర వున్న మా ఎస్టేట్ ఓ బుల్లి పోస్టేజ్ స్టాంప్ సైజులో వుంటుంది. ప్రోటోకాల్ ప్రకారం మా ఎస్టేట్‌కి ఐదు గన్‌ల సెల్యూట్ చాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది.

అసలు మా సంస్థానపు పేరే అలా తగలబ



డింది. నిశాపూర్ అంటే చిమ్మ చీకటి, అమావాస్య గుర్తుకొస్తాయి. ఇక నిషాపూర్ అంటే ఇంకా పరువుపోయే అర్థం వస్తుంది. ఛావనీ అని పూరుకున్నాం. బయటంతా చీకటి... లోపల నిషా ఏదో విధంగా తగ్గ పేరే అని సరిపుచ్చుకున్నాము.

నా మనసులో ఓ మూలదాగి వున్న భయం భయంకరమైన నిజం కాబోతోంది. ఏదో వో రోజున నా తండ్రి మహారాజా ధీరేంద్ర సింగ్ కోట బురుజు మీదకు నన్ను తీసుకుపోయి వజ్రాల వుంగరాలతో నిండివున్న తమ చేతిని అన్ని దిక్కులూ కవర్ చేసేలా వూపి ఆనంద బాష్పాలు రాలుతుండగా "బాబూ ఈ రాజ్యమంతా కొద్ది రోజుల్లో నీ చేతుల్లో పెట్టబోతున్నాను" అని అంటారేమోనని.

సమాధానం ఏం చెప్పాలో నాకు తెలియదు. అయినా ఎవడికి కావాలీ సంస్థానం? పడిపోబోతున్న కోటగోడలూ, రాచ మర్యాదల మీదా, వాటి ఆచరణ మీదా పూర్తిగా ఆధారపడి మరే పనీ చేయకుండా ముప్పూటలా తిని కూచునే వేలాది సోమరిపోతుల్ని మేపడానికా ఈ రాజ్యం? రాజుల హోదాల కోసం ప్రజలని పీడించుకు తిని వాళ్ళ శ్రమని కొల్లగొట్టి తాము దర్జాగా లక్జరీని అనుభవించే దుష్ట సంప్రదాయాలని ఇంకా కొన్ని తరాలు మోయడాన్ని మహత్తర బాధ్యతగా ఎలా వూహించటం? ఈ సంస్థానానికి అప్పులు ఎక్కువ. బొక్కసమంతా ఖాళీ. ప్రజా సంక్షేమ చర్యలు తీసుకోవడానికి వనరులు లేక ఆ కార్యక్రమాలు బొత్తిగా ఏమీ వుండేవి కావు. ప్రజల కళ్ళల్లో రాజులంటే ఎంత అసహ్యమో చూస్తేగాని చెప్పలేము. ఏనుగుల్లాంటి రాజవంశీయుల కుటుంబాలని మోసి మోసి అలసి సొలసి శోష కొచ్చారు జనం. బయట జనం ఏమనుకుంటున్నారో బొత్తిగా తెలియదు– మహారాజుకీ, ఆయనకి సలహాలిచ్చే ఇతర రాజ బంధువులకీ, కోర్ట్ ఆఫీషియల్స్‌కీ.... దివాన్ సంగతి సరేసరి. అంతకన్నా పెద్ద విలన్ ఏ క్రైమ్ నవలలోనూ వుండడు.

సంస్థానపు ప్రజల వెనుకబడిన తనం... ఆకలి చావులు... ఇతర సమస్యలు పట్టించుకునే నాధుడు లేడు. అన్నింటికీ దేవుళ్ళున్నారు, వాళ్ళకి వదిలేస్తే సరి, అంతా సరిగ్గా జరిగిపోతుంది అనే గట్టి నమ్మకం.


అందుకే ఈ రాజ్య పాలనా భారం ఎక్కడ నెత్తిన పడుతుందోనని నాకు చచ్చేంత భయం.

నా పట్టాభిషేకం నా కొచ్చే పీడకలల్లో ముఖ్యమైన కల. వణుకుతో, చెమటతో తడిసిన బట్టలతో లేచి కూర్చుంటాను. మళ్ళీ నిద్రపట్టదు.

నా తండ్రి మహారాజా ధీరేంద్ర సింగ్‌కి మెచ్చుకోదగ్గ అతి ఖరీదైన హాబీలున్నాయి. మంచి టేస్ట్ వుంది. ఖరీదైన కారులు కొనడం... వాటిని విదేశాల నుండి ఇంపోర్ట్ చేయడం... ఖరీదైన ఆడవాళ్ళని చేరదీయటం, విలాసంగా జీవించటం, మోసాలు చేయటం, గాంబ్లింగ్, ప్రాక్టికల్ జోకులు వేయడం, మోసాలు చేయటం... ఈ హాబీలు ఇదే వరసలో వుండాలన్న నియమం ఎక్కడా లేదు. అవసరాన్ని బట్టి వరస మారుతూ వుంటుంది. ఆయన వద్ద ఓ డజన్ కార్లున్నాయి. సిల్వర్ ప్లేటెడ్ రోల్స్ రాయిస్, బెంట్లే, ఆస్టిన్ ట్రయంఫ్, మారిస్ పియర్స్ యారో... డయామ్లర్, మెర్సిడస్, ఫోక్స్ వాగన్, స్కోడా, మోడల్ T ఫోర్డులు, ఓల్డ్స్ మొబీల్ ... చెవ్రోలే... ఇంకా ఇతర కార్లు కూడా ఆయన కలెక్షన్‌లో వున్నాయి.

ఇన్ని కారులున్నా ఆయనకి తృప్తి వుండేది కాదు. కొత్త మోడల్ కారు ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రాగానే దానిని కొనేవరకూ ఆయనకు నిద్ర పట్టేది కాదు. ఎలాగో డబ్బు పే చేసి, వొక్కోసారి అప్పుగా కారు తెప్పించేసి మంచి జిగేల్‌మనే నూతన జరీ వస్త్రాలను ధరించి మా రాజ వంశీయులు తరతరాలుగా ధరిస్తున్న వజ్రాల నగలు మెడనిండా వేసుకుని పట్టణంలో చిన్న పర్యటన చేసి ప్రజల నమస్కారాలు అందుకునేవారు. లోపల ప్రజలేమనుకునేవారో మాకు తెలియదు. మహారాజా వారు ఇలా దర్శనం ఇచ్చారంటే ప్రజలలో అభిమానం వెల్లివిరిసినట్లుగా నటిస్తూ కొత్త కారుల్నీ తమని ఇలాంటి వైభవ దర్శనాలతో హింసిస్తున్న తమ రాజునీ అతడి వంధి మాగధులనీ చూసి వాళ్ళు జాలిపడేవాళ్ళు అనుకుంటాము. ఒకటి రెండుసార్లు నేను మా తండ్రిగారితోపాటు ఈ కారు వూరేగింపులకి వెళ్ళి పరిస్థితులు గమనించడం జరిగింది. ప్రజలకి తిండి తిప్పల్లేకపోయినా, ఇంత గొప్ప వైభవం– గ్రాండ్ స్పెక్టకిల్ చూస్తే చాలు.

—కె. సదాశివరావు




వాళ్ళకి కన్నుల విందు జరిగి వాళ్ళ కడుపులు నిండిపోయినట్లుగా ఫీలయి వాళ్ళు అన్ని బాధలూ మరచిపోయి సంతోషిస్తారని నా తండ్రి దృఢ నమ్మకం. అందమైన మహారాజా విలువైన ఆభరణాలు, జిగేలుమనే దుస్తులు ధరించి, .బాండు మేళాలతో కాంతులీనుతున్న కొత్త కారులో- విచిత్రంగా శబ్దంచేస్తూ కదిలే యంత్రం- హార్స్‌లెస్ కారేజ్- చూస్తే అదేదో మాయాలోకంలో వుండే భ్రమ కలిగేదేమో ప్రజలకి. ఎండిపోయిన డొక్కలతో వున్న ప్రజల వేపుకి ఉల్లాసంగా నవ్వుతో ఆదరంగా చేతులూవుతూ పర్యటన జరిగేది. ప్రజలు గుడ్లప్పగించి చూసేవారు. పిల్లలు మాత్రం మా వెంటబడే వారు నవ్వుకుంటూ కేరింతలు కొడుతూ. పాపం వాళ్ళకి తెలియదు మరో కొన్నేళ్ళు గడిస్తే వాళ్ళు నవ్వడం పూర్తిగా మానేసే పరిస్థితి వస్తుందని.

ఈ సంవత్సరం వర్షాలు లేవు. కరువు పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఎక్కువగా కనిపించాయి. రాజ్యంలోని చాలా గ్రామాలనుండి రిపోర్టులు వచ్చాయి. బియ్యం, గోధుమ బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు పెరిగినట్లు, ధరలు అదుపు లేకుండా పెరుగుతున్నట్లుగా, వ్యాపారస్తులు గోడవున్లలో ధాన్యం దాచి పెట్టారనీ మాకు తెలిసింది.

బ్రిటిష్ రెసిడెంట్, పొలిటికల్ ఏజంట్ మోర్టిమర్ బ్రౌన్ రాబోతున్న విపత్తు గురించి నా తండ్రికి వార్నింగ్ ఇచ్చాడు. చేయవలసిన కార్యక్రమాలను కూడా సూచిస్తూ తన నివేదికను సమర్పించాడు. కార్మిక సంక్షేమానికీ, రైతుల రక్షణకీ, ఇతర వృత్తులలోని వారికి ఏమేమి చేస్తే ఈ భయంకరమైన క్షామం నుండి బయటపడగలమో అతడు స్పష్టంగా తన రిపోర్టులో వుదహరించాడు.

మోర్టిమర్ తన రిపోర్ట్ ఇచ్చి విషయాలు చెబుతున్నప్పుడు నా తండ్రి తలూవుతూ విన్నాడు. ఆయన కళ్ళలో చిత్రమైన మెరుపు వచ్చింది. నా అనుమానం ఏమిటంటే ఆయన మనసులో వున్న వ్యూహం క్షామ నిర్మూలన గురించి కాకపోవచ్చు- ఎవరో యూరోపియన్ సెక్స్‌బాంబ్ వైటల్ స్టాటిస్టిక్స్, లేకపోతే లోకల్ ఫ్లేమ్‌టట్స్.... కాకపోతే మార్కెట్‌లోకి కొత్తగా రాబోతున్న కొత్త మోడల్ కారు... ఆయన మనసుని ఆక్రమించి శ్రద్ధగా క్షామం గురించి వింటున్నట్లుగా నటించారు.

ఆయన తన స్వంత పద్ధతిలో బాగా ఆలోచించి ప్రజల కష్టాల్ని తీర్చడానికి ఓ సింపుల్ మెథడ్ కనిపెట్టి ఆచరణలో కూడా పెట్టేశాడు. ఈ విధానాన్ని ఎలా అమలుపరచాలో రాజ్యమంతటా చాటింపు వేయించారు. అన్ని వూళ్ళలోనూ ప్రజలు పెద్ద ఎత్తున పూజలు జరపాలనీ, దేవుళ్ళకు దేవతలకు పెళ్ళిళ్ళు- ఇతరమైన ముచ్చట్లు నిర్విరామంగా జరపాలని, అందువల్ల దైవాలనుండి వచ్చే శుభాశీస్సులతో ప్రజల ఈతి బాధలు, ఆకలి దప్పులు తొలగిపోతాయని వారి నమ్మకం.




*డాక్టర్ వేగం గారి దగ్గరకు ఓ పెద్దమనిషొచ్చి "డాక్టరు గారూ! నిద్రలో నడిచే అలవాటు పోవాలంటే ఏం చేయాలి?" అని అడిగాడు.*

*డాక్టరుగారు వెంటనే ఏదో మందు సిరంజిలోకి ఎక్కించి ఆ పెద్దమనిషి మరో మాట చెప్పేలోపే అతని జబ్బ పుచ్చుకుని ఇంజక్షన్ వేసేసి "ఇంకా నాలుగింజెక్షన్లు వేయాలి. రోజుకొకటి వేయించుకో!" అని చెప్పాడు.*

*ఆ డాక్టరుగారి వేగానికి బిత్తరపోయిన ఆ పెద్దమనిషి జబ్బ సవరించుకుంటూ "ఆ అలవాటు నాక్కాదండీ; మా ఆవిడకి" అన్నాడు.*

*—జె.ఎస్.పి.ఎస్., భట్టిప్రోలు*

ప్రజలు వెంటనే ఈ కార్యక్రమాల్ని నిర్విఘ్నంగా అమలు చేశారు. పూజా పునస్కారాలతో వివిధమైన ఇతర సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోయాయి. రాజ్యమంతటా ఘనంగా పూజలు జరిగాయి. ప్రార్థనలు, భజనలు, హరికథలు.... ఇంకా ఇతర కార్యక్రమాలతో రాజ్యం హోరెత్తి పోయింది. దేవతల కటాక్ష వీక్షణాలే ఈ విపత్సమయంలో ప్రజలకి ముఖ్యంగా కావలసిన సరుకని నమ్మకం ప్రజలలో వుంది. ప్రజల నమ్మకాలని దృష్టిలో వుంచుకుని కార్యక్రమాలని ఆచరణలో పెట్టాలన్నది నా తండ్రి సిద్ధాంతం. తిరునాళ్ళు జరిగాయి పెద్ద పెద్ద ప్రభలతో. జనం వాటిలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మంచి దుస్తులు వేసుకుని ప్రజలు ఈ ఉత్సవాల్లో ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ దేవతలు... ఇంకా చిన్నా పెద్ద దేవతల ఆలయానికి దుమ్ము దులిపి రంగులు వేసి వైభవంగా అలంకరించారు. దేశం తాత్కాలికంగా కళకళ లాడింది. ధనికులు పేద ప్రజలకి అన్నదానాలు చేసి పుణ్యాన్ని ఎంతో కీర్తినీ సంపాదించుకున్నారు.

ఇలా వుండగా ధాన్యం మార్కెట్‌ల నుండి పూర్తిగా మాయమై పోయింది. అసలే సరైన భోజనాలు లేకుండా మాడుతున్న ప్రజలందరూ తమ తమ తల రాత అనీ, అంతా విధి నిర్ణయమనీ, పూర్వజన్మలో ఏదో సామూహిక మహాపాపం చేసి వుంటామనీ, అందుకే తమకీ విపత్తులు వచ్చాయనీ తమ చేతుల్లో ఏమీ లేదని నమ్మి నిశ్శబ్దంగా, శాంతి యుతంగా మరణిస్తున్న వార్తలు రాజ్యపు నలువేపుల నుండీ వస్తూనే వున్నాయి. పరిస్థితి భయంకరంగా పరిణమిస్తున్నదని అందరికీ అర్థమయింది. ఆ రిపోర్టులను చదివి నా తండ్రి విషాదం ఉట్టి పడేలా ముఖం పెట్టి అన్నారు.

"నా ప్రియమైన ప్రజలు... నా బిడ్డల్లాంటి ప్రజలు... ఎంత బాధలు పడుతున్నారు! భగవంతుడా ఏమిటీ పరీక్ష?" అంటూ ఆకాశం కేసి వోసారి చూశారు. సమాధానం రాలేదు. వారి కళ్లలో సన్నటి కన్నీటి తెరలున్నాయి. మంచి నటన అనుకున్నాను నేను.

ఇంత బాధ పడుతున్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం ఎక్కువగా డబ్బు ఖర్చు పెట్టిన పాపాన పోలేదు. ధనాగారంలో అసలు డబ్బు వుంటేగా ఖర్చు పెట్టడానికి!

బ్రిటీష్ రెసిడెంట్ ఢిల్లీలోని వైస్రాయికి రిపోర్టు పంపారు. భయంకర క్షామ పరిస్థితులను వర్ణిస్తూ, సంక్షేమ కార్యక్రమాలలో ఏమీ పస లేదనీ, ప్రజల బాధలు వర్ణనాతీతంగా వున్నాయనీ, వెంటనే తగు చర్యలుతీసుకుని పరిస్థితులను చక్క దిద్దాలనీ ఆ రిపోర్టు విజ్ఞప్తి చేసింది. నిజానికి ఆ రిపోర్టు నా అసమర్థ పాలన మీదా, రాజరికపు అశ్రద్ధమీదా... ఇలాంటి రిపోర్టులు ఢిల్లీలోని బ్రిటీష్ ప్రభుత్వానికి వెళ్ళడం కొత్త గాదు. తమ మీద వ్యతిరేకంగా రిపోర్టులు వెళ్లినపుడు నా తండ్రి వాటి నుండి తప్పించు కోవడానికి ఎత్తులు వేసి అవి విజయవంతంగా చేసి ఎలాగో బయట పడేవారు.

బ్రిటీష్ రెసిడెంట్ తప్పుడు రిపోర్టులు ఇచ్చి తన రాజ్యాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నాడని గోలపెట్టి అతడిని బదిలీ చేయించాడొకసారి. లంచాలకి లోబడేవారయితే ఆయన పని మరీ సులువు. కావలసినంత డబ్బిచ్చి నోరు మూయించే వారు. మరి కొందరికి పెద్ద రొమ్ముల కోర్టెసాన్‌లని పంపి సెడ్యూస్ చేయించేవారు.

బ్రిటీష్ వారికి చూచాయగా తెలుసు, పరిస్థితులు అంతగా బాగా లేవని, అవినీతి రాజ్యమేలుతున్నదనీ, నానా రకపు అన్యాయాలు జరుగుతున్నాయనీ, రాజుని పద భ్రష్టుడిని చేసి బ్రిటీష్ కిరీటం క్రిందికి తేవాలన్నది ఓ మార్గం. రెండోది- వున్న రాజుని తీసేసి యువ రాజుని సింహాసన మెక్కించడం. రెండో మార్గాన్ని అమలు చేయాలని వైస్రాయి అభిమతం. అదే జరిగితే నా కొంప మునుకుతుందని నా భయం. ఈ బాధ్యతను ఎలా వదిలించుకోవాలన్నది నా ప్రస్తుత సమస్య.

ఈసారి మరో రిపోర్టు వెళ్ళింది. పరిస్థితులను చక్కగా గ్రాఫిక్‌గా వివరిస్తూ అవినీతి, నిర్లిప్తత, ఆకలి దప్పులతో యమ యాతనలు పడుతున్న ప్రజలు.... చావులు... దివాలా తీసిన ఆర్థిక పరిస్థితులు ... ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వపు నిరాసక్తత, నిర్లక్ష్యం.... ఈ గందర గోళపు పరిస్థితుల గురించి వివరంగా వుంది రిపోర్టులో.

విచారణకు మరో అధికారిని ఢిల్లీ నుంచిపంపించడం జరిగింది వైస్రాయ్ అన్నీ విచారించి త్వరలో రిపోర్టు ఇవ్వమన్న ఆజ్ఞతో...

సర్ జేమ్స్ మెక్ లారెన్‌లు మా సంస్థానానికి విజయం చేయడం లోని కారణం అది. నడిచే పర్వతం లాంటి భార్యామణి లిడియా మెక్ లారెన్‌తో సహా వారు మా ప్యాలెస్‌లో అడుగు పెట్టారు. పెద్ద టెంటు లాంటి సిల్కు గౌను వేసుకుని మెడనిండా హారాలతో, చేతి వేళ్లనిండా ఉంగరాలతో, మణి కట్టుకంటి బ్రేస్ లెట్స్‌తో... నెత్తి మీద రింగులు తిరిగిన ఇనుప వైరు లాంటి ఎర్రటి జుట్టుతో... చూడగానే...ఎర్రటి లిప్‌స్టిక్ పూసుకుని అప్పుడే లేడి పీక కొరికి తిని వచ్చిన పులి నోటి లాంటి నోటితో... ఆవిడకి కి.రి.యంటిలీ లక్షణాలన్నీ వున్నాయి...ముఖ్యంగా నగలు వేసుకోవడంలో.

ఆమెకి తిండి తర్వాత ముఖ్యమైన ఆకలి నగల కేనని నా తండ్రి ముందే గూఢచారుల ద్వారా కను గొన్నాడు. ఈ భోగట్టా తెలియ గానే ఆయన ఎంత గానో సంతోషించారు.

మెక్ లారెన్ దంపతులను సముచిత మర్యాదలతో రాజమహల్లోనికి ఆహ్వానించి, అతిథుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మోతీ మహల్లో వారికి విడిది ఏర్పాటు చేశారు. స్నానాలు అయిన తర్వాత పెద్ద విందు ఏర్పాటయింది. రాజ ప్రముఖులు, బంధువులు, ముఖ్యమైన ఉద్యోగులు, రాజ వంశీయులు అందరూ ఈ విందులో పాల్గొన్నారు. కోళ్ళ మాంసం... పిట్టల మాంసం... రకరకాల డ్రింక్స్ సర్వ్ చేశారు. పెద్ద పెద్ద ప్లేట్లలో పూర్తిగా వండిన బాతులు, కోళ్ళు, గొర్రెలు... వెజిటబుల్స్ మధ్య ఎరేంజి చేసి వడ్డించారు. రెక్కలు విరిచిన పెద్ద పిట్టలు... ఫిజెంట్స్... నోరూరేలా వండి ఆకర్షణీయంగా వడ్డించారు. లేత కూరగాయలు... పండ్లు... అప్పుడే వేడి వేడిగా బేక్ చేసిన బ్రెడ్‌లు... రొట్టెలు... కేక్‌లు... టార్ట్‌లు...పేస్ట్రీలు... ఇతర పదార్థాలు వంటింట్లో నుండి విడతెగని ప్రవాహంతో వచ్చి ఆ విందును విజయవంతం చేశాయి.


మా పాలెస్‌లో అద్భుతమైన వంట వాళ్లున్నారు. నిముషాల్లో ఎలాంటి వంటకాలనైనా వండి వడ్డించగల చాతుర్యం వున్న వాళ్లున్నారు. యూరోపియన్–వాటిలో ఫ్రెంచి, ఇంగ్లీష్, ఇటాలియన్, అమెరికన్, మొగలాయి... ఎన్ని రకాలైనా చేయ గలరు వాళ్లు.

మూడు పూటలా నీళ్ల వంటలు తినడం వల్ల మా పాలెస్‌లో వుండే జనమంతా ఏనుగుల్లా ఖడ్గమృగాల్లా బలిసి కదల లేక పోయారు. తిని తాగి పడి వుండే జనం మరే వ్యాపకం లేకుండా బ్రతికే జనం ఎలా వుంటారు మరి? కష్టపడడం అన్న సంగతి ఎన్నో తరాలుగా తెలియదు. తిని నిద్ర పోయి, లేచి తిని బ్రతికేస్తున్నారు.

అందుకే మా పాలెస్‌లో వుండే వాళ్లకి బయట వుండేవాళ్లకీ చాలా తేడా ఏనుగులకీ ఎలుకలకీ వున్నట్టుగా.

విందుకు ముందుగా నా తండ్రి లేడీ మెక్

# చిన్నప్పటి వేసంకాలం



గ్రీష్మంతో గొడకు వేళ్లాడుతున్న
చిన్నప్పటి వేసంకాలం
ఏకాంతం అరచేతిలో వసంతంలా వాలుతుంది
నదుర్ల పంధ్యల్ని పక్కకు పెట్టి
వేస్తాలు వస్తారు, ఆనందాలు కురిపిస్తారు

ఉదయాన్నే అందర్నీ పలకరించుకుంటూ
భుజాలపై కర బంధాలతో
అవనిపై కాక ఆకాశంలో తేలుతూ
స్వచ్ఛమైన సుమధురమైన
స్నేహపు పన్నీరు జల్లుకుంటూ
మాటల కోటలు కట్టుకుంటూ
ఆకాశహర్మ్యాలలో విహరిస్తూ–
అందరం ఆనందాల పందిళ్ళు వేస్తాం
కాలువగట్లూ, మామిడి తోటలూ కొలిచేస్తూ
మధ్యాహ్నపు సూరీడుని
పండు వెన్నెలలు జల్లే జాబిలిగా
మార్చుకుంటూ–
కృష్ణమ్మ ఒడిలో కేరింతలు కొడుతూ
ఆ ఒడ్డూ ఈ ఒడ్డూ ఏకం చేసుకుంటూ
పడవ పందాలలో పోటీలు పడుతూ
వడగాలిని మలయమారుతంగా
అనువదించుకుంటూ–
మామిడితోపులో ఎంకోయిలలకు
బదుళ్ళు చెబుతూ–
అనుకున్నంతనే అన్ని రుచుల వాహ్లాదింపచేసే
అలనాటి వేసంకాలం మనసంతా మాధుర్యాన్ని ఒంపుతుంది

చెరువు పక్క రామాలయంలో
సాయంకాలం చర్చల్లో
భూమ్యాకాశాలను ఏకం చేసుకుంటూ–
ఊరిచివర టూరింగ్ టాకీసులో
రాత్రి చూపిన సినిమా నెమరువేసుకుంటూ–
పెట్టగోడపక్క కొబ్బరాకు వెన్నెలపై
వచ్చిరాని కవిత్వాలల్లుకుంటూ–
ఇంటి దగ్గర అమ్మానాన్నల
ఆశీర్వాదాలందుకుంటూ
మళ్ళీ రేపు గురించి తియ్యని కలలు
కనేందుకు నిద్రాదేవికి స్వాగతం పలుకుతూ
కులం, మతం, ద్వేషం, స్వార్థం లేని
చిన్నప్పటి వేసంకాలం–
తలుపుతట్టిన చప్పుడుతో
మరపు మేకుకు మళ్ళీ గోడకు వేళ్ళాడుతుంది

— చిదంబరం

లారెన్‌కి వజ్రాలు పొదిగిన బ్రేస్‌లెట్, ఎమరాల్డ్‌లు వున్న నెక్‌లేస్ బహూకరించాడు. ఇది మా వంశాచారమని తెలియజేశాడు. వాటిని చూడగానే ఆవిడ కళ్లు పెద్దవయ్యాయి. ఆశ్చర్యంతో... ఆనందంతో... కీచుమంటూ ఓ కేక పెట్టి కుడకుడ లాడుతూ మురిసి పోతూ వెంటనే ధరించేసుకుంది. ఆవిడ మెడలో ఇప్పటికే ఎన్నో హారాలు వున్నాయి. మన గ్రామాల్లో వుండే గంగిరెద్దులా వుంది ఆవిడ అవతారం. మొత్తానికి ఆవిడ సంబరానికి భర్త ఫీలవు తున్న ఇబ్బంది ఏమాత్రం అడ్డు రాలేదు.

"ఎలా వుంది డార్లింగ్?"

"వెరీ నైస్ మైడియర్"

"ఓ యువర్ హైనెస్, యూ ఆర్ స్వీట్" అంటూ పట్టరాని సంతోషంతో మహారాజుని ఉద్దేశించి అంది.

ఆవిడ ఆనందం చూసి మాకందరికీ ముచ్చట వేసింది.

సభ్యత కొద్దిగా అడ్డుపడి నట్టుంది. ఓ క్షణం పాటు విజ్ఞత పైకి వచ్చి బాధించినట్లుగా వుంది.

"యువర్ హైనెస్! మీరు వీటిని ఇవ్వడం ఏమీ బాగాలేదు"

"మై ప్లెజర్ మేడమ్" అన్నారు మహారాజా శ్రీయస్‌గ్యాలంట్‌గా. శివశ్రీ పుట్టి పడే లా.

"ఈ నగలు మేడమ్ ధరించడం వల్ల వాటికి అందం వచ్చింది" వచ్చి అబద్ధాలు కన్నార్పకుండా చెప్పడంలో మహారాజా సమర్థులు.

"ఓ థాంక్యూ యువర్ హైనెస్"

నన్ను పరిచయం చేయడం జరిగింది. మెక్ లారెన్ మహాశయుడు నాతో కరచాలనం చేశాడు.

# నేనెప్పుడూ యుద్ధ వ్యతిరేకినే...!!

యుద్ధం ఎవరి మధ్య నయితేనేం...?
ఏ యుద్ధంలో ఎవరు గెలిస్తేనేం...?
నే నెప్పుడూ యుద్ధ వ్యతిరేకినే...!!


బంకర్ల బోనులో బాల్యాన్ని బంధించి
భయాన్ని తినిపించిన మహాబూచి యుద్ధానికి
బ్రతుకులూ - బిడ్డలూ
తల్లులూ - తండ్రులూ
కళ్ళ ముందు ఛిద్రమై —
నెత్తురు కన్నీరై ప్రవహించే రాక్షస యుద్ధానికి
కోట్ల జీవరాసులు జాలి జాలిగా మహనీయ మానవుల్ని ప్రశ్నించి
మరణ వాంగ్మూలాలు చదివించి
ఆత్మని మెలిపెట్టే పిండుతున్న కాఠిన్య యుద్ధానికి
నే నెప్పుడూ వ్యతిరేకినే...!!

యుద్ధమంటూ మొదలయినప్పుడూ...
గెలుపొక్కటే సంధి సూత్రమైనప్పుడూ...
మతివెడిన వాడి మూర్ఖ వ్యూహం
జనావాసాల నిండా నెత్తుటి మరకలూ
మాంసం ముద్దలూ వెదజల్లుతుంది!!

యుద్ధం ముగిసిపోవచ్చుగాక
ఏ యుద్ధంలో ఎవడు గెలిస్తేనేం గాక...?
స్మశానంలో..శవాలు కాలుతున్న పచ్చి వాసనలో
పండుగ ఎవరిక్కావాలి గనుకా?
జీవించే హక్కును కాలరాస్తున్న
అనివార్య క్షణాల మధ్య తప్ప —
ఎప్పటికీ - మరెప్పటికీ నేను యుద్ధ వ్యతిరేకినే!!

రచనా కాలం — గల్ఫ్ యుద్ధం జరుగుతున్నప్పుడు

—రావులపల్లి సునీత



లేడీ మెక్‌లారెన్‌కి నేను నమస్కారం చేశాను.

గలగలా నవ్వుతో స్వీట్‌గా అంది

"వాటే ఛార్మింగ్ ప్రిన్స్! కదూ జేమ్స్!"

"యస్ మై డియర్"

మహారాజా వాళ్ళకి చెప్పారు

"ఆక్స్‌ఫర్డ్‌లో చదివి మొన్నే ఇండియాకు వచ్చాడు, మేడమ్"

"ఓ రియల్లీ! హౌ వండర్‌ఫుల్"

"నా వారసుడు. కొద్ది రోజుల్లో నా బాధ్యత ఇతడికి అప్పగించి మేము విశ్రాంతి తీసుకుందా మనుకుంటున్నాము"

ఎంతో పాథిటిక్‌గా కంఠం పెట్టి ఆ కంఠ స్వరా నికి ఉచ్ఛారణకి సరి పోయేలా ముఖ కవళికలను మార్చి అన్నారు

హెవెన్ ఫర్ బిడ్ అనుకున్నాను.

"ఆక్స్ ఫర్డ్‌లో ఏం చదివావు యంగ్ మాన్"

మెక్ లారెన్ అడిగాడు.

"హిస్టరీ, ఎకనామిక్స్"

"చాలా ఇంటరెస్టింగ్‌గా వుండి వుండాలి"

"యస్ యస్ చాలా ఇంటరెస్టింగ్" ఒప్పుకు న్నాను.

విందు ప్రారంభమైంది.

అది ఓ మారథాన్ సెషన్.

మేము భోజనం చేస్తుండగా నా తండ్రి కాజువ ల్‌గా సంస్థానపు పరిస్థితులను గురించి వివరించారు.

"సర్ ఈ సంవత్సరం వానలు చాలా తక్కువగా పడ్డాయి. పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. వీలైనంతగా మేము శాయశక్తులా చర్యలు తీసుకుంటున్నాము."

మెక్ లారెన్ తలూపాడు.

మోర్టిమర్ బ్రౌన్ విస్మయంతో చూస్తున్నాడు. బయట జనం చస్తుంటే అది చాలా చిన్న విష యంలా, వాతావరణం గురించి స్మాల్‌టాక్‌లా చెబుతున్నాడని. అతడు తిండి తినడం లేదు. పూర్ చాప్ అనుకున్నాను. అతడి బాధ నాకర్థమ యింది.

బ్రౌన్ నన్ను అడిగేవాడు మేము క్లబ్‌లో స్క్వాష్ ఆడడానికి వెళ్ళినప్పుడూ..... పోలో గ్రౌండ్‌లో...

"అమర్ నీవు బయట పరిస్థితి అధ్వాన్నంగా వున్నదని మహారాజాకి ఎందుకు చెప్పవు?"

"ఆయనకి తెలియదని ఎందుకనుకుంటున్నావు మోర్ట్? అన్ని విషయాలూ ఆయనకి బాగా తెలుసు"

"దటీజ్ హారిబుల్! తెలిసీ అలా ప్రవర్తిస్తున్నా రంటే నేను నమ్మను"

"యు బెటర్ బిలీవ్ ఇట్ మోర్టిమర్. మరో గేమ్‌కి రెడీ!"

మెత్తగా స్పైస్‌తో వండిన లివర్ ముక్క తింటూ మెక్ లారెన్ అన్నాడు.

"ఢిల్లీకి చాలా ఆందోళనకరమైన రిపోర్టులు వచ్చాయి"

"పరిస్థితి మరీ అంత అధ్వాన్నంగా దిగజారలేదు సర్ జేమ్స్! నేనంటే గిట్టని వాళ్ళు ఏవో రిపోర్టులు రాస్తూనే వుంటారు. మనం వాటిని పట్టించుకోకూ డదు" అంటూ మోర్టిమర్ బ్రౌన్ వైపుకి ఓ విషపు చూపు విసిరారు.

బ్రౌన్ ముఖం ఎర్రబడింది. ప్రొటెస్ట్ చేయబోయి సభా మర్యాద పాటించి వూరుకున్నాడు. అన్నింటికీ టైమ్ వుంది అని సరి పెట్టుకుని.

"వీలున్నంత వరకూ రాత్రి పగలు నిద్రాహారాలు లేకుండా మేం సంక్షేమ, కార్యక్రమాలు చేపట్టి వాటిని సక్రమంగా దీక్షతో మహత్తరమైన బాధ్య తతో మానవతా దృక్పథంతో అమలు చేస్తున్నాము. మా బిడ్డల్లాంటి ప్రజలు. వారి యోగ క్షేమాలు నాకన్నా ఇంకెవరికి కావాలి?"

మంచి ప్రశ్న అనుకున్నాను.

"అయితే మిమ్మల్ని అభినందించక తప్పదు. ఇలాంటి సమయాల్లోనే ప్రభుత్వపు సామర్థ్యాలకి పరీక్ష"

"వెల్‌సెడ్ సర్ జేమ్స్"

ఓ ప్రక్కన బాగా వండిన మాంసపు ముక్కలు ట్రేలలో నుండి మాయమై పోతున్నాయి. రాజ బంధువులు, కోర్ట్ అఫీషియల్స్ సంభాషణలతో ఏమాత్రం కాలం వృధా చేయకుండా ఏక ధ్యానతో తనివితీరా తాగుతూ, పొట్టనిండా తింటున్నారు. లేడీ మెక్ లారెన్ బుగ్గల్లో ఓ రెండు గువ్వ పిట్టలు. ఫుల్‌గా వున్నట్టుగా వాచిపోయి వున్నాయి. ఆమె నుదుట చెమట మెరుస్తోంది. ఆమె మనాయా సంగా కేజీల లెక్కన రకరకాల మాంసాలనీ, లీటర్ల లెక్కన వైను తాగుతూ ఆ విందుకు న్యాయం చేస్తోంది.

అన్ని ఐటెమ్స్‌నీ మా వంటవాళ్ళు అద్భుతంగా

వండారు మరి.

"సర్ జేమ్స్! నా పరిపాలనలో ఇది మూడవ కరువు. ఇంత గడ్డు పరిస్థితి మా చరిత్రలో ఎప్పుడూ లేదని పండితులు సెలవిస్తున్నారు"

అప్పుడు మా ఆస్థాన విద్వాంసుడు, చరిత్ర కారుడు అయిన విద్యారణ్య పండితుడు తన గళ మెత్తాడు. వీరి వంశీకులే మా రాజవంశ చరిత్రని ఎన్నో శతాబ్దాలుగా రాస్తున్నారు.

"మహారాజా వారు సెలవిచ్చింది నిజం ప్రభూ. పదహారో శతాబ్దంలో మహారాజా గంభీర్ సింగ్ వారు రాజ్యమేలుతున్న రోజులలో ఓ కరువు వచ్చి దాదాపు రెండు వేలకు మంది మరణిం చారని మా రాజవంశ చరిత్ర చెబుతోంది. ఆ తర్వాత చిన్నా పెద్దా కరువులు వస్తున్నా ప్రస్తుత విపత్తు గణనీయంగా చాలా ముఖ్యమై నది. అయినప్పటికీ మా మహారాజావారు నిద్రా హారాలు లేకుండా ప్రజాసేవ చేస్తున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం వారు కూడా తమరి ద్వారా వారికి తగి నంత సహాయం అందజేస్తే మా ప్రజలు ఎల్ల ప్పుడూ తమకు కృతజ్ఞులుగా వుంటారు"

ఇది ముందే ప్లాన్ చేసిన స్పీచ్ అని అందరికీ తెలుసు. తన డ్యూటీ అయిపోయినట్టుగా మహా రాజా వంకకి చూశారు. వారు 'వెల్‌డన్' అన్న ట్టుగా తల పంకించి తమ ఆమోదం తెలియ జేశారు. పండితుల వారికి ఏదో మంచి బహు మతి లభిస్తుందని మిగిలిన వారంతా అసూయతో చూశారు.

"ష్యూర్! ష్యూర్! ప్రజలకి వున్న బాధ్యతలను బ్రిటిష్ గవర్నమెంట్ ఎన్నడూ మరవదు" గంభీ రంగా అన్నాడు మెక్ లారెన్.

చికెన్ లెగ్‌ని పళ్ళతో పీకుతూ అంది లేడీ లిడియా మెక్ లారెన్.

"అందుకేగా మేము వచ్చింది" నోటి నిండా చికెన్ మాంసం వుండగా మాట్లాడటం చాలా కష్టం. ఆవిడ మాటలు ఏవిటోగా అనిపించాయి.

"థాంక్యూ మేడమ్. యు ఆర్ కైండ్" అంటూ బేరర్‌కి సంజ్ఞ చేశారు మహారాజా.


ఆవిడ ప్లేటులో కొత్తగా పొగలు కక్కుతున్న ఫుల్ చికెన్ వడ్డించడం జరిగింది.

"చాలు, చాలు" అని ఆవిడ హాఫ్ హార్టెడ్‌గా అడ్డుపడబోయింది.

"మా సమస్యలు అంత తేలికగా తీరవు సర్ జేమ్స్. మా రాజ్యానికి ముఖ్యంగా కావలసినవి ఓ రెండు డాములు, రెండు మూడు వందల బావులు. ఇవి కాకుండా వున్న చెరువులని బాగా లోతు చేయడం. దానికి బాగా డబ్బు కావాలి. మా సంస్థానం అంత ఖర్చు భరించలేకపోతోంది."

తమరు ఖరీదైన కారులు కొనకుండా, ముంద లకి వజ్రాల నగలు ఇవ్వకుండా, గాంబ్లింగ్ చేయ కుండా వుంటే ఆ పథకాలన్నీ అమలు చేయడానికి వీలుంటుంది అనుకున్నాను.

## యోగ



"నువ్వు తినవద్దు" అంటే యోగ కాదు

"నువ్వు తిను" అంటే అదీ యోగ కాదు

"నువ్వు ఎంత తినగలవో అంత తిను" అంటే యోగ అసలే కాదు

"నువ్వు తిని వదలాలనుకున్నది వదిలెయ్" అంటే యోగ కానే కాదు

"నీకు కావలసినంత తిను" అనేది యోగ కాదు

"నీ శరీరానికి కావలసినంత తిను" అని చెప్పేదే యోగ!

సేకరణ : మంత్రి ఉమామహేశ్వరరావు

"ఓ నో" అన్నారు మెక్ లారెన్ లేడి మాంసపు ముక్కని నములుతూ.

"నేను ఈ పథకాలకి బ్లూప్రింట్‌లు తయారు చేయించి సిద్ధంగా వుంచాను. తర్వాత మీకు చూపిస్తాను" అన్నారు మహారాజా.

"ఎక్సెలెంట్! కీపిటప్! కీపిటప్! మహారాజా" అన్నాడు మెక్ లారెన్.

నా తండ్రి ఆనందంతో చుట్టూ చూశాడు. విందు ఆయన వేసిన పథకం ప్రకారం సాగు తోంది.

లేడీ మెక్ లారెన్ నాప్‌కిన్‌తో మూతి తుడు చుకుంది. తన హాండ్‌బాగ్లోని బుల్లి అద్దం తీసి లిప్‌స్టిక్ మళ్ళీ వేసింది. లేళ్ళ మందని పూర్తిగా ఎముకలతో సహా తినేసిన పులి మూతిలా వుంది. మెడలోని నగల్ని ఓసారి తడుముకుని మరో రౌండ్ తిండి మొదలెట్టింది.

భోజనాల టోర్నమెంట్‌లో స్లో అండ్ స్టెడీగా వుంటే గెలుపు తనదేనని ఆవిడకి తెలుసు. ఛాంపి యన్‌లా ఆవిడా కార్యక్రమంలో పాల్గొన్నది మాత నోత్సాహంతో.

బయట ఎండలు ముదిరిపోయి ఉన్నాయి. గాలిలో తేమ ఉడికి పోతోంది. పంకా లాగే వాళ్ళు తమ పని చేస్తున్నారు. ఆ పెద్ద హాలులో అంతమందికి పంకాల గాలి సరిపోదు. వేడి వేడి వంటకాలు, పొగలు, సెగలు, ధారాపాతంగా శరీ రాల నుండి కారుతున్న చెమట, మసాలాల వాసన, ఆల్కహాల్ ఆవిరి. వాతావరణం దుర్భ రంగా వుంది. విందు ఎంత త్వరగా అయిపో తుందా అనుకుంటూ కూచున్నాను... తింటున్న ట్టుగా నటిస్తూ, జరుగుతున్న నాటకాన్ని చూసి ఆనందిస్తూ.

బయట ధ్వజన్ల కొద్దీ కూలీలు వట్టివేళ్ళ తడికెల మీద నీళ్ళు చల్లుతూ ఎండల్లో మగ్గిపోతున్నారు. విందు సాగిపోతూనే వుంది. కోటలో వుండే రాజ బంధువుల్లో ఇద్దరు ముగ్గురు బాగా పడిపోయే పరిస్థితిలో సర్వెంట్స్ వాళ్ళని లేపి ఈడ్చుకొంటూ తీసుకుపోయారు. నేను ఓ రెండు ముక్కలు తిని ఓ గ్లాస్ బీర్ తాగుతూ తమాషా చూస్తున్నాను. నా చుట్టూ జరుగుతున్న భోజనాల టోర్నమెంట్ నా ఆకలిని చంపేసింది. మోర్టిమర్ బ్రౌన్ పరిస్థితి కూడా అలానే వుంది.

పొట్ట నిండా మాంసాలు, వంటి నిండా ఆల్కా హాలు, వాచిన ముఖం, కారుతున్న చెమట, అతు క్కుపోయిన గౌను, స్లీవ్ నుండి వాటర్‌ఫాల్‌లా కారుతున్న చెమట.... లిడియా మెక్ లారెన్ బీట్ రూట్‌లా ఎర్రబడిపోయివుంది. చేతిలోని జపనీస్ వినవకర్రతో హిప్పో పోటమస్‌లా నాజూగ్గా విసురు కుంటూ సేద తీర్చుకుంటోంది.

ఖర్మకాలి ఆవిడకి కుడి పక్కన నేను కూర్చుని వున్నాను. మరోవేపు మహారాజావారు కూర్చొని వున్నారు. సెకండ్ రౌండ్‌లో ఆవిడ గళం విప్పింది. అంతే ఇక నూయలేదు. ఒకటే వాగుడు. ఆవిడ చిన్నపిల్లగా డబ్లిన్‌లో ఉన్న రోజులు, ఢిల్లీ విష యాలు, ఢిల్లీలో ఎవరు ఎవరితో ఎఫయిర్లు నడు పుతున్నారో, వాటి పూర్తి వివరాలు, స్కాండల్స్ ఎవరెవరు ఎంతెంత లంచాలు పుచ్చుకున్నారో, ఎవరి భార్య బిచ్, ఏ ఆఫీషియల్ సన్ ఆఫ్ ఎ బిచ్ లేక బాస్టర్డ్ అన్నీ పూసగుచ్చినట్టుగా చెబుతోంది. ఎందుకో ఆవిడ విరగబడి నవ్వింది. అమె జోకులు ఆమెకే ఎమ్యూజింగ్‌గా, ఫన్నీగా అనిపించాయి అనుకుంటాను. మధ్య మధ్య నవ్వు మోచేతితో డొక్కలో పొడుస్తూ నవ్వింది. ఇంకా ఎక్కువసేపు వుంటే నా పక్కటెముకలు విరిగేవి. ఎలాగో తప్పిం చుకున్నాను.

"వాట్ నాన్సెన్స్" అని దబాయించేది మొగుణ్ణి.

"దటీజ్ వెరీ ఫన్నీ డియర్" అనేవాడు.

అన్ని జోకులకీ నా తండ్రి విరగబడి నవ్వేవాడు. జోకులు కానివాటికి కూడా అదేదో డ్యూటీలా, గాలంట్‌గా నవ్వి లేడీకి ఆనందం కలిగించాడు.

"వాట్ ఎ ఛార్మింగ్ మాన్" నా చెవిలో గుసగుసలా డింది లేడీ మెక్ లారెన్.

"యస్ మేడమ్" అని ఒప్పుకున్నాను.

మోర్టిమర్ బ్రౌన్‌కి ఇవన్నీ ఎంబ్రాసింగ్‌గా వున్నాయి. అతడి ముఖం కందగడ్డలా వుంది. ఆంగ్లరాజ్య పతనాన్ని కళ్ళముందే చూస్తున్న వాడిలా కనిపించాడు. అతడి పరిస్థితికి నాకు జాలి వేసింది.

లిడియా మెక్ లారెన్ మహారాజాని అడిగింది

"ఈ ప్రాంతాల్లో కాలక్షేపానికి ఏం చేస్తారు యువర్ హైనెస్?"

"మేడమ్‌కి ఏ విషయాల్లో అభిరుచి వుంటే

వాటి ప్రకారం చెప్పగలం. మీకు ఆసక్తి వున్న సంగ తులు చెప్పండి" అడిగారు మహారాజా.

నగలు, తిండి – వేరే ఇంకేం అభిరుచి ఈవిడకి అనుకున్నాను.

"వార్మింగ్ అప్‌యు! నాకు ఎప్పటి నుండో ఓ డ్రీమ్ యువర్ హైనెస్"

"ఏమిటది మేడమ్?"

చెప్తావా అన్నట్టు సర్ జేమ్స్ వంకకు చూసింది.

అతను అనుమతి కోసం ఆగకుండానే చెప్పేసింది.

"జేమ్స్ ఓ టైగర్‌ని వేటాడితే చూడాలని నా కోరిక. వేటంటే అతడికి అసలు ఇష్టం లేదు. ఢిల్లీలో మా గ్రూప్ భార్యలలో నా ఒక్కదానికే టైగర్‌ను గురించి ఏమీ తెలియదు. అందరి ఇళ్ళల్లో టైగర్ చర్మాలు, స్టఫ్ చేసిన టైగర్‌లు వున్నాయి. అవన్నీ వాళ్ళ భర్తలు షూట్ చేసినవి. జేమ్స్‌కి వేట అంటే ఎలర్జీ. నాకోసం జేమ్స్ ఒక్క టైగర్‌ని షూట్ చేస్తే నేను ఆనందిస్తాను మహారాజా"

"దానికేం భాగ్యం మేడం. తమరికోసం టైగర్ వేట ఎరేంజ్ చేయగలను తక్షణం" అభయమిచ్చారు మహారాజా.

"ఇప్పడు ఈ వేటలూ అవీ ఎందుకు లిడియా డియర్?"

"జేమ్స్ నేను ఎప్పడూ నిన్ను ఏదీ అడగలేదు. ఈ ఒక్కసారి నా మాట విను డార్లింగ్. one single tiger for your darling Lydia"

"సరే లిడియా" అని మూలుగుతో ఒప్పుకున్నాడు.

రెండు మూడు రోజులలో టైగర్ హంట్‌కి ఏర్పాట్లు చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

లిడియా మెక్ లారెన్ చప్పట్లు కొట్టి కేరింతలు కొట్టింది. ఖడ్గమృగపు కొమ్ములా ఆవిడ మోచేయి నా ప్రక్కటెముకల్లో మరోసారి దిగబడింది.

"ఎంత మంచి భర్తో, నా మాట కాదనడు" అంది

బాధగా నవ్వాడు మెక్ లారెన్

"అఫీషియల్ పనులు ముగిసిన తర్వాత టైమ్ వుంటే అలాగే. నీ మాట ఎందుకు కాదనాలి డియర్" అన్నాడాయన.

ఈవిడతో బ్రతకటమే ఓ టైగర్ వేటకన్నా భయంకరంగా వుండి వుండాలి. క్షణక్షణాన్ని భయంతో, సస్పెన్స్‌తో, టెన్షన్‌తో.... అందు వల్ల అసలు వేటల మీద ఆసక్తి లేక పోవడంలో ఆశ్చర్యం లేదు అనిపించింది.

"నాకు మాట ఇవ్వాలి డార్లింగ్ నీ లిడియా కోసం ఎలాగైనా ఓ టైగర్‌ని కొట్టి ఇస్తానని. మహారాజా ఏర్పాటు చేస్తానన్నారుగా"

"ఆల్‌రైట్ డియర్ ఆల్‌రైట్"

రంగం సిద్ధమయింది.

నా తండ్రి కళ్ళలో నిలిచి మెరుపులు.... వలలో నిండుగా చేపలు పడ్డ బెస్తవాడిలో, ఉచ్చులో ఎక్కువ జంతువులు దొరికిన వేటగాడిలో వుండే సంతృప్తి ఆయనలో కనిపించింది.

భోజనాలు అయాక మేము మా మందిరాలలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకున్నాము. మిగిలిన మాంసం, కూరలు, కోళ్ళు, పిట్టలు అన్నీ మా పాలెస్ కెన్నెల్స్‌లోకి వెళ్ళాయి. అక్కడ పెరిగే వందలాది కుక్కలు – గ్రేట్ డేన్‌లు, అల్సేషియన్లు, హౌండ్ డాగ్స్... ఇంకా ఎన్నో రకాల కునకాలు ఖరీదైన భోజనాలు చేస్తాయి.

కోట బయట కరువు పరిస్థితులను గురించి మాకే కాదు మా కుక్కలకి కూడా తెలియదు.

మూడు రోజులలో టైగర్ వేటకి సిద్ధం చేశారని నాకు మోర్టిమర్ బ్రౌన్ ద్వారా తెలిసింది.

సాయంత్రం అతిథులకు మా పాలెస్‌లోని ఇతర గదులు, అమూల్యమైన తర తరాలనుండి మా వంశానికి సంక్రమించిన కళాఖండాలు, నగలు, శిల్పాలు – చారిత్రకంగా ముఖ్యమైన ఖడ్గాలు...... మా పాలెస్ ఓ చిన్న మ్యూజియమ్ వంటిది...అవన్నీ మెక్ లారెన్ దంపతులకు చూపించారు.

ప్రాసాదపు చీకటి గదుల్లో జరిగిన దారుణాలను గురించి వారికి చెప్పేవారు ఎవరూ లేరు.

లేడీ మెక్ లారెన్ జనానా లోనికి వెళ్ళి నా తల్లి, ఇతర రాణులతో కాలం గడిపిందని తెలిసింది. వాళ్ళ ముసుగులు, బరువైన జరీ దుస్తులు, ధరించిన నగలు చూసి ముచ్చట పడిందట. తనుకూడా చీరతో సింగారించుకోవాలన్న ముచ్చట తీర్చుకుందట. ఆవిడ ఓ తొమ్మిది గజాల చీరకట్టి, తగిన నగలు పెట్టేసరికి హిప్పో పోటమస్‌కి అలంకరణ చేసినట్టుగా చూసేవారికి ఒళ్ళు జలదరించజేసేలా భయంకరంగా వుందట. సర్వెంట్స్ ఆవిడ అవతారాన్ని చూసి జడుసుకున్నారని తెలిసింది.

మరునాటి రెండు దినాలూ జేమ్స్ మెక్ లారెన్ మా సంస్థానంలో అఫీషియల్‌గా టూర్ చేశాడు. రోల్స్‌రాయిస్ కారులు, బెంట్లీలు చిన్న కారవాన్ లాగా వెంటరాగా దివాన్, మోర్టిమర్ బ్రౌన్ ఇతర అధికారులు అందరూ కరువు ప్రాంతాలను సందర్శించారు. కొన్నిచోట్ల రిలీఫ్ వర్క్స్ చేస్తున్నట్లుగా హడావిడిగా వున్నాయి. అక్కడ కార్లను ఆపి ప్రజలను ప్రశ్నించడం జరిగింది. వాళ్ళు కూడా క్షామ పరిస్థితులు వున్నప్పటికీ దయ గల మహారాజా చల్లగా చూస్తూ ఎంతో కృషి చేసి తమ సంక్షేమానికి పాటుపడుతున్నాడనీ, వారిని దేవుడు చల్లగా చూడాలనీ విన్నవించుకున్నారు. మహారాజా ఇదంతా ముందే రిహార్స్ చేసిన డ్రామా. మహారాజా ఫిక్స్ చేసిన వాటిని మార్చి వేరే వాటిని చూపించడానికి మోర్టిమర్ బ్రౌన్ శాయశక్తులా ప్రయత్నం చేశాడు. అవి సాగనీయకుండా ఏవో అభ్యంతరాలు చెప్పి తన మాట నెగ్గించుకున్నారు మహారాజా.

## నిషిద్ధ స్వప్నం

నేనమ్మలో ఉన్నప్పుడు
నేను కావాలని అమ్మ కోరుకుంటున్నట్టు
నాన్నకు తెలియగానే
తండ్రి చెంప పగలకొట్టిన నాన్న దెబ్బకి
నే నెవరో నాకు తెలిసింది.
నేనొక స్త్రీని —
నేనొక నిషిద్ధ జీవిని —
మొన్నటి దాకా నా నవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే.

నా బ్రతుకొకరికి బరువట
నా బాధ్యతలు మరింత బరువట
ఎందరికో వీరతిలకం దిద్దిన తల్లి
ఇక్కడ పంఘం అందిస్తున్న విషాన్ని
తన చేత్తోనే విచ్చలవిడిగా పంచుతోంది.
బుడిబుడి గారాలతో గడపాల్సిన నా బాల్యం
పసిగుడ్డుగా ఉన్నప్పుడే వేదెక్కిపోతోంది
ఆ వేదు జీర్ణించుకున్న నిముషంలోనే
నేను ఎక్కడ్నుంచి వచ్చానో అక్కడికే తిరుగు ప్రయాణం
తొమ్మిది నెలల ప్రయాణం అలసట తప్ప
పది నిముషాల విశ్రాంతి కూడా నాకు నిషిద్ధం.
నేను తెంపుకుంటూ పుట్టిన పాపానికి
వెంటనే కడుపంతా ఉంగలు చుట్టుకుంటూ
భయానకంగా చావాల్సి వస్తోంది.
ఇక్కడ భగవంతుడు ఒక కొబ్బరి కాయిస్తే
మరణం ప్రసాదించేస్తాడు.
ఎన్ని నవ్వుల్నిక్కడ చెరిపేస్తున్నారో?
ఎన్ని ఇళ్ళ మొదళ్ళని నరికేస్తున్నారో?
ఎన్ని చిరుదీపాల్ని వెలిగించిన వెంటనే
సుడిగాలిలా ఎత్తుకు పోతున్నారో?
చిట్టి ప్రాణాల హృదయ విదారక
మరణ వేదనల రోదనలే
దేవుడి తెల్ల ముఖాన్ని
అక్కడ గుడిగోడలపై సున్నంగా పూస్తున్నాయి.
అక్కడ భగవంతుడు కూడా
నా మరణానికి మౌనంగా సిగ్నలిచ్చేస్తున్నాడు.
నే పుట్టినట్టు అమ్మ కలగన్న పాపానికి
తిండి లేకుండా కృశింప చేసినప్పుడు
అమ్మ మౌనంగా కుళ్ళిపోయినప్పుడు
నేననుకున్నా...
నేనొక నిషిద్ధ జీవినే కాదు —
నిషిద్ధ స్వప్నాన్ని కూడా...

(ఆడపిల్లయితే పుట్టిన వెంటనే గుడి వెనక విషం ఇచ్చి చంపే రాజస్థాన్ గ్రామాల్లోని దుష్టాచారం విని)

—"శ్రీమతి"

ముందు ప్లాన్ చేసిన విధంగా అన్ని చోట్లా మెక్ లారెన్ సాహెబ్ మెడలో పూల మాలలు వేశారు. ఆయనను పొగుడుతూ ఏదో భాషలో కర్ణ కఠోరంగా ఏవో పాటలు పాడారు. ఆ దండలు తీసేస్తే ఏమనుకుంటారోనన్న సంశయంతో అలాగే తిరిగాడు పాపం. కొత్త వూళ్ళలో మళ్ళీ దండలు వేశారు. అతడి మెడ నిండిపోయింది. He felt like a blody fool. కాని ఏం చేయాలో తోచలేదు. ఢోలక్, హార్మోనియం ఇతర గ్రామీణ వాయిద్యాల నుండి వచ్చే శబ్దాలు, గ్రామస్తుల కంఠాల నుండి వస్తున్న పాటలు అతడికి నెర్వస్ బ్రేక్ డౌన్ తెచ్చేలా వున్నాయి. చెవులు గింగురు మంటుండగా, కణతలు అదిరిపోతుండగా, ఎండ వేడిలో అతడి మెదడు ఉడికి పోతూ వుండగా టూర్ జరిగింది. ఈ హింసని మహారాజా గమ నిస్తూనే వున్నారు. He must have enjoyed this as the biggest joke.

మెక్ లారెన్‌కి ఆస్తమా వుంది. వారి మెడలోని ముద్దబంతి వూలవాసనలు ఉక్కిరి బిక్కిరి చేసి ఊపిరి ఆడనీయకుండా చేశాయి. ఓ ప్రక్క రొస్త... తుమ్ములు... చెమట.... మరో ప్రక్క వాయిద్యాల మోత.... అది ప్రత్యక్ష నరకంలా తోచి వుండాలి.

ఏ వూరు వెళ్ళినా ఇదే వరస. ఇంకా వూళ్ళు చూడాలని కోరుకుంటే ఇదే ట్రీట్‌మెంట్ జరుగు తుందని మెక్‌లారెన్‌ని హడలగొట్టడమే మహారాజా వారి ఉద్దేశం. ఈ ప్రయత్నంలో వారు సఫలీకృతు లైనారు.

"సర్ మెక్ లారెన్! మరో రెండు గ్రామాలు సందర్శించుదామా? లేక పాలెస్‌కి వెళ్ళిపోదామా?"

మెక్ లారెన్ కళ్ళలో భీతి. ఇంకా గ్రామాలా? ఈ ఎండలోనా? ఈ పూల మాలలతోనా? ఈ శబ్దాలు భరిస్తూనా? నో!! నో!! నో!!

"అవసరం లేదు యువర్ హైనెస్. పరిస్థితి నాకు అర్థమయింది."

"అయితే పాలెస్‌కి వెళ్ళిపోదామా?"

"గుడ్ ఐడియా మహారాజా"

మోర్టిమర్ బ్రౌన్ అనుమానంతో కొన్ని గ్రామాల పేర్లు చెప్పి అవి చూడటం చాలా ముఖ్యమన్నాడు అప్పుడు మహారాజా కలగ చేసుకుని "యువర్ హైనెస్ ఆ వూళ్ళు చూడవచ్చు. కాని వొకటే "చిక్కు"

"ఏమిటది?"

"ఏమీ లేదు యువర్ హైనెస్! ఆ వూళ్ళో ఏదో జబ్బులున్నాయని తెలిసింది."

"ఏమిటా జబ్బులు మహారాజా"

"ఏమీ లేదు. స్మాల్ పాక్స్ యువర్ హైనెస్"

"స్మాల్ పాక్స్! మోర్టిమర్ ఆర్ యు క్రేజీ? ఆ గ్రామాలని ఎందుకోసం చూద్దాం మహారాజా"

మహారాజా తనలో తాను నవ్వుకున్నాడు తిరిగి వెళుతున్నామన్న వార్త అందరికీ చేరింది.




కారవాన్ వెనక్కి తిరిగింది.

ఎండలో కమిలిపోయిన ముఖంతో, మెడలో నిండుగా వుండి తనకి కంపరం కలిగిస్తూ గాలి పీల్చుకోనీయకుండా బాధిస్తున్న బంతి పూల దండల్ని, ఇతర పూలహారాలనీ తీసిపారేసి హాయిగా లెదర్‌సీట్ మీదికి వాలిపోయి హాయిగా వూపిరి పీల్చాడు హెన్రీ మెక్‌లారెన్ సాహెబ్. చెవులలో డోలక్ శబ్దాలు ఇంకా గింగురుమం టూనే వున్నాయి.

అందరూ తిరిగి పాలస్‌కి చేరుకున్నారు. కరువు ప్రాంతాల నుండి వచ్చిన సామూన్యవు ఇన్‌స్పెక్షన్ అధికారుల నుండి అందరూ కూల్‌డ్రింక్స్‌తాగి సిద్ధంగా వున్న హెవీ లంచ్‌కి ఉపక్రమించారు. ఈ కరువు సముల సమీక్ష కోసం ఢిల్లీ నుండి వచ్చే టీముల గురించి మా వంట వాళ్ళకి బాగా తెలిసి వుండాలి. చక్కగా వారికి తనివి తీరేలా చాలా రకాల వంటలు చేసి వడ్డించారు. అవురావురు మంటూ తిన్నారు మెక్ లారెన్, ఇతర బృందస భ్యులు. భోజనాల తర్వాత విశ్రాంతి తీసుకున్నారు.

మరునటిరోజు రాత్రి టైగర్ వేట ఏర్పాటు చేశారు. వేట ఎరేంజ్ చేసిన అరణ్య ప్రాంతం మా కోటకి ఓ ఇరవై మైళ్ళ దూరంలో వుంది. పాలెస్‌లోని కారులన్నీ పాలిష్‌తో మిలమిలలాడాయి. హంటింగ్ డ్రెస్‌లతో, సిత్ హేట్స్‌తో

వేటగాళ్ళు సిద్ధమయారు. మహారాజా, నేను, రాజ బంధువులు పెర్మనెంటుగా మాడిపోయి నట్లున్న ముఖంతో రెసిడెంట్ మోర్టిమర్ బ్రౌన్ ముఖ్య అతిథితో సహా అందరం వెళ్ళాము. వేటగాళ్ళు, క్రాక్ షాట్స్, హంటింగ్ ఎక్స్‌పర్ట్స్ వెంటరాగా కార్లనిండా రకరకాల తుపాకులు, మస్కెట్లు, రైఫిళ్ళు, ట్వెల్వ్‌బోర్ గన్స్, తూటాల పాకెట్లు, బజాకాలు.....

**We were ready for the big event!**

మేము చేరేసరికి ఏడు గంటలయింది. చీకటి పడింది. కారులలోనుండి దిగేసరికి అక్కడ చెవులు బద్దలయే లాగ నాలుగు బాండ్ల వాళ్ళు ఒకేసారిగా "గాడ్ సేవ్ ద కింగ్" వాయించారు. రెండు ఫుల్ బ్రాస్ బాండ్స్, రెండు పైప్ బాండ్స్... విచిత్రంగా వున్న యూనిఫారాలతో, ఎప్పుడూ ఉత కని మురికి టోపీలతో సిద్ధంగా వున్నాయి. మా అతిథికి మతిపోయింది.

"యువర్ హైనెస్ టైగర్ వేట ఇక్కడేనా? లేక..."

"సర్ జేమ్స్ ఇక్కడే. ఇక్కడే సరిగ్గా కొద్ది గంటల్లో జస్ట్ వెయిట్" అని నవ్వారు మహారాజా.

"మరి ఈగోలకి, సందడికి టైగర్లు ఇక్కడికి వస్తాయా అసలు?" అనుమానంగా అడిగాడు మెక్ లారెన్.

"సర్ జేమ్స్ నాకీ ప్రాంతం బాగా తెలుసు. ప్లీజ్ రిలాక్స్. ఎంజాయ్ యువర్‌సెల్ఫ్. కోయి హై?" అని గావుకేక పెట్టారు మహారాజా. సేవకులు పరు గెత్తుకొచ్చారు.

"అంతా రెడీయేనా?"

"సిద్ధం 'మహారాజా" తలలు వంచి అన్నారు సేవకులు.

మెక్ లారెన్ వయసు దాదాపు అరవై. ఆయన జీవితమంతా ఇంటలెక్చువల్ పర్స్యూట్స్‌లో గడి పాడు. టిపికల్ ఇంగ్లీష్‌మన్. జంటిల్‌మన్. మంచి వాడు. వూలిష్.. కంగారు మనిషి.. శారీరక శ్రమ అసలు ఎరుగని వాడు. దాదాపు నాలుగు దశాబ్దాలు మద్రాసు, కలకత్తా, ఢిల్లీలో ఇతర ప్రాంతాల్లో నివసించినవాడు. ఎంతో ఓపిక వున్న శాంత స్వభావుడు. భార్యా విధేయుడు.

"మహారాజా వేట ఎన్ని గంటలకి?"

"డిన్నర్ తర్వాత సర్ జేమ్స్"

'గ్రేట్ స్కాట్! మరో జెయింట్ సిద్ధం' అనుకు న్నాను.

అలాగే జరిగింది.

ఫీస్ట్ అయ్యాక పాట కచేరీ ఏర్పాటు చేశారు. బాగా వయసు మీరిన రాజ నర్తకి కాటుక పెట్టిన పెద్ద కళ్ళతో, బాగా జరీ వున్న పెద్ద లంగా వంటిది కట్టుకుని వుంది. నెత్తిమీద ఎర్ర సిల్క్ మేలి ముసుకు వేసుకుని వుంది. హెవీ బోజమ్ క్లీవేజ్ బాగా కనబడేట్లుగా చిన్న జాకెట్. మెడ నిండా నగలు. ముక్కుకి మెరుస్తున్న వజ్రపు పుడక. నోటినిండా నిరంతర తాంబూల సేవనంతో గార పట్టిన పళ్ళు. బుగ్గ నిండా కారా కిళ్ళీ. చేతులకు గోరింటాకు. వంటి నిండా చీప్ సెంట్. అదేదో అత్తర్ అనుకుంటాను. సిగనిండా మల్లెలు. టెంటు నిండా రసికుల మధ్య ఆమె నైపుణ్యం ప్రదర్శిం చింది.

అప్పుడు ప్రారంభమయింది నాట్యం. ఆ ప్రక్రి యని నాట్యం అనాలో, లేక కేవలం అభినయంతో కూడిన శరీర కదలికలు అనాలో తేల్చుకోలేకపో

యారు ప్రేక్షకులు.

ముజ్రా అంటారమకుంటాను.

కళ్ళు టపటపలాడిస్తూ... చేతులు తిప్పుతూ... వళ్ళు పెక్సీగా విరుచుకుంటూ... కన్ను కొడుతూ... నవ్వుతూ... అభినయించింది... పాటలు పాడింది... ప్రక్కనే తబలా... హార్మోనియం... ప్రక్క వాయిద్యాలు... ఆవిడ కంఠం స్రిల్‌గా వుంది. కోయిలకి పదిళం పట్టినట్టుగా అనిపించింది.

అజారే... మేరా బాలమ్... హాయ్‌రే ఓ పజనా... మేరా పప్నా... ఛోడ్‌దో మేరా హాత్... వంటి పదాలు పుష్కలంగా వున్న పాటలు ఓ రెండు గంటలు పాడింది. పాందాన్‌లో వున్న కిళ్ళీలు నములూ నాజూగ్గా ఉగల్‌దాన్‌లో ఊస్తూ తన పంగీతంలో వొంటి విరుపులతో కొంటె చూపుతో పభికులకి వెర్రెక్కించింది.

మహారాజా వారి కళ్ళు మత్తుతో, రపికతతో జోగి పోయాయి. ఆ నర్తకి పేరు ప్యారీ బాయి. తన గాన కళా వైదుష్యంతో, నృత్య కళా కౌశలంతో మహారాజా వారి మనసు చూరగొన్న కళాకారిణి అని తేలిపోయింది.

మహారాజావారు పరైన పమయంలో

"వా! రేవా " అంటూ మెచ్చుకున్నారు.

"ఖూబ్" అంటూ వంద రూపాయల నోట్లు నర్తకి మీదకి విసిరారు.

ఆ నోట్లను ఆవిడ తన ఎదలో దోపింది పెక్సీగా.

ఈ పాంస్కృతిక కార్యక్రమం మెక్ లారెన్ మహాశయుణ్ణి ఏమాత్రం ఆకట్టుకున్నట్టుగా లేదు. ఓల్డ్ విక్లో షేక్స్‌పియర్ నాటకాలు, కవెంట్ గార్డెన్‌లో మ్యూజికల్ కామెడీలు, ఒపెరాలు చూడడం అతడికి ఇష్టం అని ముందే తెలుసుకున్నాము మేము. ఆవలింతలు అవుకుంటూ పభా మర్యాదకు భంగం రాకుండా రెండు గంటలూ భరించి తన పభ్యతను చాటుకున్నాడు.

వాళ్ళ ఒపెరాలు మన వాళ్ళకి చూపిస్తే వాళ్ళకి పిచ్చెక్కడం ఖాయం. పంగీతంలో వున్న చిక్కు ఇదే. ఒకరి క్లాపికల్ మరొకరికి తలనొప్పి. ఒకరికి ఫేవరిట్ మరొకరికి టార్చర్.

ఎలాగయితేనేం వేటకి పమయమయింది.

వేటగాళ్ళు తమ తమ తుపాకులతో రెడీ అయ్యారు.

**Time for the great hunt. It was funny. It was** Grotusque .

అప్పటికి అర్థరాత్రి దాటింది.

**It was the perfect time for the Royal Hunt of the Tiger.**

టెంట్ల బయటకు వచ్చి అందరమూ ఓ వంద గజాలు నడిచాము. అక్కడ ఓ చెట్టు వుంది. దానికి ఓ నిచ్చెన వుంది. ఆ పైన ఓ మంచె.

"ఈ చెట్టెక్కడమా? నో థాంక్యూ" అని మొరాయించాడు ప్రధాన వేటగాడు పర్ మెక్ లారెన్ ఆ మాచన చేయగానే.

"మీరు చెట్టు ఎక్కడం చాలా అవపరం పర్ జేమ్స్. లేకపోతే డేంజరస్. నామాట మీరు వినండి" బ్రతిమాలాడు దివాన్.

"హియర్ మి.నో! నో! నో!" ఖండితంగా చెప్పేశాడు మెక్ లారెన్.

ఇంతలో టైగర్ గర్జన వినిపించింది.

టకీమని చెట్టెక్కి కూర్చున్నాడు.

మంచెమీద మెక్ లారెన్, మహారాజా, నేను ఎక్కి కూర్చున్నాము. కొందరి చేతుల్లో గన్స్ వున్నాయి. మెక్ లారెన్ చేతికి ఓ లోడ్ చేసిన రైఫిల్ ఇచ్చారు మహారాజా. మిగిలిన షికారీలు వేరే చెట్లలో, ఇతర మంచెలలో ఎక్కడెక్కడో రహస్య స్థావరాలలో దాగి వున్నారు.

అందరం పులి కోసం ఎదురు చూశాము.

కొద్దిగా చంద్రకాంతి. చెట్ల నీడలు నేల మీద పడి చీకటి పృష్టిస్తున్నాయి. అందరూ గుపగుపలతో మాట్లాడుకుంటున్నారు. కీచురాళ్ళ అరుపులు వినిపిస్తున్నాయి. కాంప్‌లోని మనుషులు, వంటవాళ్ళు, బేరర్లు, నౌకర్లు, బేండువాళ్ళు, రాజరక్షకి... అందరూ నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నారు.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ, మెక్ లారెన్ పాహెబ్ జడుసుకుని ఎగిరిపడేలా ఎవరిదో కంఠం గట్టిగా అరిచింది.

"పులి!"

ఎన్నో కంఠాలు కోరస్‌గా అరిచాయి.

"పులి! పులి! పులి! టైగర్! బాగ్!!"

ఎవరెవరో గట్టిగా ష్.. ష్.. ష్.. ష్.. అన్నారు. పైలెన్స్ అన్నారెవరో.

అప్పుడు నేను పులిని చూశాను.

చెట్ల మధ్యన వున్న ఖాళీ పలంలోనికి ఓ పులి వచ్చింది. దాని నడకలో ఏదో కొత్తదనం వుంది. దాని గర్జనలో ఏదో దోషముంది. బహుశా అనారోగ్యం వల్లనేమోననుకున్నాను. మందు తిన్నదానిలా, బాగా ఆల్కహాల్ సేవించిన తాగుబోతు పులిలా అడ్డదిడ్డంగా జిగ్‌జాగ్‌గా నడుస్తోంది. దాని అడుగులు తడబడుతున్నాయి. నిలబడలేకపోతోంది.

మెక్ లారెన్ చెవిలో మహారాజా అన్నారు గట్టిగా "పర్ జేమ్స్ షూట్!"

ఆ చీకట్లో, చెట్ల నీడలలో గుబురుగా వున్న కొమ్మలలో మెక్ లారెన్ పాహెబ్‌కి ఏదీ కనిపించలేదు. ఆయనకి దృష్టిలోపం వుంది. తాగిన విస్కీతో, తిన్న భోజనంతో ఆయనకి నిద్ర ముంచుకు వస్తోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. అయినా గన్ ఎత్తి తనకి తోచిన దిక్కుకి గురి చూసి ట్రిగ్గర్ నొక్కాడు.

ధన్‌మని బుల్లెట్ ఆకాశం దిశగా చుక్కల వేపుకి వెళ్ళింది.

అన్నివేపుల నుండి కాల్పులు ధన్... ధన్... బాగ్... బూమ్... క్రాక్... క్రాష్.. పూష్ అంటూ ఫెళ ఫెళా అన్ని తుపాకీలు పేలిపోయాయి.

పులి టక్కున చచ్చిపడింది.

అందరం చెట్లు దిగి వచ్చాము. మెక్ లారెన్‌ని జాగ్రత్తగా దించాము. ఈ శబ్దాలతో ఆయన నిద్ర ఎగిరిపోయింది. చాలా ఎక్సైట్ అయి వున్నారు.

లాంతర్లు ముట్టించారు. టార్చ్‌లైట్ల కాంతిలో మేము ఒకరినొకరు అభినందించుకున్నాము. కొందరు విస్కీ బాటిల్స్ ఓపెన్ చేసి గ్లాసుల్లో తలో రౌండ్ దించారు. కొందరు పిగరెట్లు, చుట్టలు వెలిగించారు. ఈ పాహప కృత్యానికి అందరూ తెగ పంబరపడిపోయారు. అందరూ మెక్ లారెన్ పాహెబ్‌ని అభినందించి కరచాలనం చేశారు.

నేను వాచ్‌వంక చూశాను. ఒంటిగంట కావస్తోంది. మేము భోజనాలు చేయడం, పాంస్కృతిక కార్యక్రమం అన్నీ అయేటప్పటికి పన్నెండున్నర దాకా అయింది. అంటే గ్రేట్ హంట్ కార్యక్రమం దాదాపు అరగంటలో పూర్తయిందన్నమాట.

చాలా బాగుంది అనుకున్నాను.

మహారాజా ప్రత్యేకంగా మెక్ లారెన్‌ని అభినందించారు ఆ టైగర్‌ని కొట్టినందుకు.

పెలెబ్రేషన్‌కి అందరూ తలో రౌండ్ విస్కీ తాగారు.

"క్వైట్ అమేజింగ్" అన్నాడు మెక్ లారెన్.

అతడి భావాలు ఎలా వర్ణించాలో తెలియలేదు. ఆశ్చర్యం, షాక్, విస్మయం, కించిత్తు గర్వం అన్నీ వున్నాయనుకుంటాను.

**He was enjoying this moment of triumph!**

"కంగ్రాచ్యులేషన్స్ పర్ మెక్ లారెన్. మీరు కొట్టిన టైగర్ చాలా పెద్దదిలా వుంది. రికార్డ్ పొడుగు వున్నట్టుంది" అన్నాడు దివాన్‌జీ.


పెట్రోమాక్స్ లాంతర్ల వెలుగులో చచ్చిపడి వున్న జంతువు పొడవు కొలుస్తున్నారు. దాదాపు రెండడుగుల టేప్‌ని దాని నోటిలో కుక్కి మిగిలిన టేప్‌తో తోక వరకూ లాగి కొలతలు తీస్తున్నారు. చివరికి చెప్పకోదగ్గ పులినే కొట్టినట్టుగా అందరూ మెచ్చుకున్నారు.

"బ్రహ్మాండం! జేమ్స్ పాబ్. దీని పొడుగు పదకొండు అడుగులు!! రికార్డ్!!"ఎవరో అరిచారు.

అంతలేట్ అయినప్పటికీ ఫొటో గ్రాఫర్, కెమెరా, నల్లముసుగు, ఫ్లాష్‌గన్ వగైరా పామాగ్రితో పిద్ధంగా వున్నాడు. ఎక్కువకాలం వృధా కాకుండా అన్ని తతంగాలూ జరిగిపోయాయి. మేమంతా గ్రూప్ ఫొటోకి నిలబడ్డాము. మెక్‌లారెన్ పులి శరీరంమీద దర్జాగా కాలువేసి గర్వంగా చూస్తూ ఫొటోకి పోజు ఇచ్చాడు.

మరునాడు ఉదయం బ్రేక్ ఫాస్ట్ పమయంలో లేడీ లిడియా మెక్ లారెన్ ఆనందం పట్టపగ్గాలు లేకుండా వుంది. ఇక ఢిల్లీ లేడీస్ పార్టీలలో కొన్ని నెలల పాటు ఈవిడ పులిని గురించి చెప్పి బోరు కొట్టి చంపుతుందేమో పాపం అనుకున్నాను.

**She was in seventh heaven!**




మెక్ లారెన్స్‌ని కౌగిలించుకుని బుగ్గ మీద చిన్న కిస్ ఇచ్చింది

"మై హీరో" అంటూ.

ఆవిడ పబ్లిగ్గా ఇంత ప్రేమ ఒలకబోస్తుంటే మెక్ లారెన్ కాస్త ఇబ్బందిగా ఫీలయ్యాడు.

మిగిలిన కొద్ది సమయంలో మెక్ లారెన్ రాజ్యంలోని ఇతర ప్రాంతాలని గూడా సందర్శించాడు. లోతుగా తవ్వవలసిన చెరువులు, కట్టవలసిన వంతెనలు, వేయవలసిన రోడ్లు అన్నీ మహారాజా వారు స్వయంగా సెలెక్ట్ చేసిన ప్రాంతాలనే చూశారు. కరువు పనులుసమీక్షించారు. వెళ్ళిన చోటల్లా కొద్దో గొప్పో కరువు నివారణ పథకాలు అమల్లో వున్నట్టుగా అంతా స్టేజ్ మేనేజ్ చేయబడింది. అవి ఫేక్ షోస్, ఈ పార్టీ తిరిగి కోటకి రాగానే ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోయేవారని నాకు తర్వాత తెలిసింది.

మహారాజా స్వయంగా మెక్‌లారెన్‌తో పాటు ఈ ప్రాంతాలకి వెళ్ళి అన్ని విషయాలూ చర్చించి తాము చేస్తున్న పనులను హైలైట్ చేశారు. చివరి రోజున అందరు ఆఫీసర్లతో మీటింగ్ జరిగింది. మహారాజా బ్రిటిష్ వైస్రాయికి ఓ శ్రీముఖాన్ని పంపారు. చాలా దీనమైన భాషల్లో చదివే వారికి కళ్ళు చెమర్చేలా, గుండె కరిగేలా ఆ మెమొరాండం రాయబడింది. అందులోని ముఖ్యమైన అంశం విశాఖపూర్ మహారాజా వారు బ్రిటిష్ ప్రభుత్వాన్ని అడిగిన పెద్ద అప్పు. వడ్డీ లేకుండా ఆ అప్పును మంజూరు చేస్తే ఆ డబ్బుతో ప్రజల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారిని కరువు రక్కసి కోరల నుండి ఎలా రక్షించేది అందులో వివరంగా రాసి వుంది. ఆ డబ్బుతో పూర్తయ్యే ఇరిగేషన్ డామ్స్, కాలువల తవ్వకాలు, మాతులు.... అన్నీ వున్నాయి.

ఆఫీషియల్ తతంగం పూర్తయింది.

చివరికి ఓ బాల్ ఏర్పాటు చేశారు.

మ్యూజిక్... డాన్సింగ్... ఫీస్టింగ్

అందరూ ఎంజాయ్ చేశారు.

బయట కరువు రక్కసి కరాళ నృత్యం చేస్తున్నదని మేమందరమూ కొద్ది గంటల సేపు పూర్తిగా మరిచిపోయాము. అసలు గుర్తుంటేకదా మర్చిపోవడానికి!

అప్పుడు నిర్దుష్టమైన రెండు ప్రపంచాలు సమాంతరంగా వున్నాయనిపించింది. ఆ రెంటికీ ఏమీ సంబంధం లేదు. అవి పూర్తిగా విరుద్ధ ప్రపంచాలు. వాటికి ఎప్పటికీ కలయిక వుండదు. కోట గోడలు దాటి వీళ్ళు అటుపోవడం, వాళ్ళు ఇటు రావడం ఎప్పుడూ జరగదు అనిపించింది. బయటి మనుషులు ఆకలితో అలమటించి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఎవరికీ తెలియని దారుణాలు ఇంకా ఎన్నో జరిగిపోతున్నాయి. ప్రజలు సహనంతో అంతా చూస్తూ అలాగే బ్రతుకుతున్నారు. వాళ్ళకి ఏం చేయాలో ఎప్పుడూ తెలియదు. వాళ్ళెవరో మాకు అసలు తెలియదు. రాజులకీ, వైస్రాయిలకీ, దివాన్లకీ, అధికారులకీ ఎవరికీ పట్టదు వాళ్ళ గతి. జబ్బులు, ఆకలి, చావులు వారికి దైనందిన కార్యక్రమాలు. అయినా వాళ్ళు అలా బ్రతుకుతూనే వుంటారు ఏవో ఆశలతో........

నేనే ఒకవేళ ఈ రాజ్యానికి మహారాజానైతే ఎలా నా బాధ్యతని నిర్వహిస్తాను? ఈ భయంకర సమస్యల్ని పరిష్కరిస్తానా? ఈ సమస్యలు నిజానికి ఏ లాజిక్‌కీ అందవు. అవి ప్రతి ఏటా, ప్రతిరోజూ కాలం గడిచిన కొద్దీ ఆ సమస్యలన్నీ బలం పుంజుకుని ఏమీ చేయలేనంత భయంకరమైన రీతిగా పెరిగిపోతున్నాయి.

**I shuddered at..at the horror of it all!**

బాల్‌కి అందరు ముఖ్యమైన రాజ బంధువులు విచ్చేశారు. ఇరుగు పొరుగు సంస్థానాధీశులు కూడా విజయం చేశారు. వారి వద్ద పని చేస్తున్న రెసిడెంట్స్, ఇతర బ్రిటిష్ ఉన్నతోద్యోగులు వారి భార్యలతో సహా వచ్చారు. మహారాజులు, రాజాధీశులు, యువరాజులు మెరిసే అమూల్యమైన వజ్రాలు పొదిగిన బంగారు నగలతో, వెండి జరీ దుస్తులతో షాండిలియర్స్ వెలుగులలో వెలిగిపోయారు. బాల్‌రూమ్‌లో మోడరన్ లేడీస్, ఈవెనింగ్ గౌన్స్‌లో వున్న యూరోపియన్ సుందరాంగులు, టక్సెడోలలో వున్న ఇంగ్లీష్ అధికారులు ఎందరో బాల్‌లో పాల్గొన్నారు.

పాలెస్ గ్రౌండ్స్‌లో గోల్డ్ అండ్ సిల్వర్ రోల్స్‌రాయిస్‌లు, లాంబోర్గినీలు, లగోండాలు, సిట్రన్‌లు, డయామ్లర్‌లు... ఇంకా ఏవేవో ఖరీదైన కారులు డజన్ల కొద్దీ వరుస క్రమంలో పార్క్ చేశారు.

అతిథులు షాంపేన్, మంచి వింటేజ్ విస్కీలు, వైన్‌లు, బ్రాందీలు తాగి వాల్ట్జ్‌లకీ, ఫాక్స్‌ట్రాట్‌లకీ డాన్స్ చేశారు. ఇంగ్లీష్ మ్యూజిక్ హాల్ ట్యూన్స్ కూడా బాండ్ వాళ్ళు వాయించారు.

ఆ సంరంభం చూస్తుంటే నాకెందుకో అనిపించింది. ఈ వ్యవస్థ మారబోతుంది. వీళ్ళంతా ఫాసిల్స్ లాంటి వాళ్ళు. డైనోజార్స్. చారిత్రక సామాజిక న్యాయాలకి భిన్నంగా ఎదురీదుతూ బతుకుతున్న మనుషులం మేం. చరిత్ర పుటల్లో ఇరుక్కుపోయి మేమంతా మా మానసిక ప్రపంచాల్లో ప్రపంచానికి ఏమాత్రం సంబంధం లేకుండా బ్రతుకుతున్నామనిపించింది. ఈ వ్యవస్థ మారుతోంది. ఎన్నాళ్ళు కొన్నివేలమంది ఆంగ్లేయులు ఈ దేశాన్ని పాలించగలరు?

**This has gone on** far too **long!**

**Too long indeed!**

గాంధీ, నెహ్రూ ఇతర నాయకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో చెప్పడం కష్టం.

**But who knows?**

బాల్ గ్రాండ్ సక్సెస్.

మర్నాడు మెక్ లారెన్ సాహెబ్ పార్టీ స్పెషల్ ట్రెయిన్ మీద ఢిల్లీకి వెళ్ళిపోయింది. రాయల్ బాండ్ ఫుల్ యూనిఫారమ్‌తో స్టేషన్‌లో సిద్ధం. పెద్ద పెద్ద పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, బంతి పూల దండలు బుట్టల నిండా రడీగా వున్నాయి. వీడ్కోలు తంతులు పూర్తయ్యాక లేడియా మెక్ లారెన్ నవ్వుతూ చేయి వూపుతుండగా ట్రెయిన్ కదిలింది.

మేమందరమూ కారుల్లో కోటకి తిరిగి వచ్చాము మా ప్రజల కళ్ళలో బాగా దుమ్ము కొడుతూ. మహారాజా వారి దర్శన భాగ్యానికి ప్రజలు సంతోషించారేమో మరి.

రిలీఫ్‌గా ఫీలయాము. గత కొద్దిరోజులు జరిగిన తతంగం వల్ల నిస్త్రాణతో వడిలిపోయి వున్నాము. కొన్నాళ్ళ రెస్ట్ అవసరమయింది.

ఓ వారం రోజులు గడిచాక మహారాజావారి నుండి కబురు వచ్చింది. వారి చాంబర్‌కి వెళ్ళాము.

"నమస్తే నాన్నగారు"

"దీర్ఘాయుష్మాన్‌భవ. కూర్చోండి"

నిలబడే వున్నాను.

"యువరాజ్ కుమార్, మేము చేస్తున్న పనులు మీకు అంతగా నచ్చడం లేదని మా ఉద్దేశం"

నేను సమాధానమివ్వకుండా ఊరుకున్నాను.

ఆయన సన్నటి నవ్వొకటి వదిలాడు మెత్తన సగా.

"మేము మన ప్రజలకి ఏమంత బాధ్యతగల రాజుగా ప్రవర్తించడం లేదని మాకు తెలుసు. ఆ విషయంలో మేము మీతో ఏకీభవిస్తున్నాము."

మౌనంగా ఊరుకున్నాను. వారు చెప్పవలసిందే మిటో చెప్పనీయడం మంచిదని తోచింది.

"ఢిల్లీ దర్బారులో వాళ్ళు మమ్మల్ని సింహాస నంమీద నుండి దింపి మీకు రాజ్యాధికారాన్ని కట్టబెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇది వాళ్ళు చేసిన ప్రయత్నాలలో మూడోది. ఇంతకు ముందు ఇద్దరు వైస్రాయిలు ఇలాగే ప్రయత్నిం చారు. మమ్మల్ని దింపడం వాళ్ళ ముఖ్యోద్దేశం. మీరు మంచి మహారాజులా పాలిస్తారన్నది మా నమ్మకం కూడాను. అన్ని విధాలా మాకన్నా బాగా. మన వంశీయుల్లో ఎంతోమందికన్నా ఇంకా జనరం జకంగా పాలిస్తారని మా నమ్మకం. కాని మేము వారి ప్రయత్నాలను ఛాలెంజ్‌గా తీసుకుని వాటికి పై ఎత్తులు వేయడంలో మాకు ఆనందం వుంది. It is amusing. వాళ్ళని ఎలా హాండిల్ చేయాలో మాకు తెలుసు. ఈ పసందైన గేమ్‌లో అప్పుడే ఓటమిని చవి చూడడం మాకు ఇష్టం లేదు. ఇంతకు ముందు జరిగిన ప్రయత్నాలలో చిత్తు చేయడం చాలా సులువుగా జరిగింది. ఇప్పుడు గేమ్ కొంచెం కాంప్లికేటెడ్‌గా తయారవుతోంది. క్లిష్టత రంగా పరిణమిస్తోంది. అయినప్పటికీ I enjoy the game. I want to play it for some more time!"


నా ముఖంలో ఏమాత్రం ఎమోషన్ లేకుండా వారికేసి చూశాను.

హఠాత్తుగా మహారాజా పెద్దగా నవ్వి మెరు స్తున్న నల్లటి కళ్ళతో నావేపు ప్రేమతో వాత్సల్యంతో చూశారు.

"మేము ఇంతగా ఎందుకు నవ్వుతున్నామో తెలుసుకోవాలని వుందా యువరాజా"

"అవును"

"ఈ దేశంలో సంపన్నులూ, అధికారంలో వున్న వాళ్ళూ అందరూ కొన్ని నిబంధనలు అలవర్చు కోవాలి. కొన్ని మెలకువలు, ట్రిక్‌లు నేర్చుకో వాలి. మీకు అవి ఎంతో అవసరం. ఏదో ఒక నాడు-బహుశా కొద్ది రోజుల్లోనే-మీరు నా కిరీ టానికీ, సింహాసనానికీ వారసులు కాబోతున్నారు. వాటితో బాటుగా మీరు నా బరువు బాధ్యత లకీ, శిరోభారాలకీ అన్నింటికీ వారసులు కాబో తున్నారు. ఈ భయంకరమైన మోసపునాటకం గురించి మీకు ఫాల్స్ ఇంప్రెషన్ లేకుండా చేయడం



మా బాధ్యతగా భావిస్తున్నాము. మహారాజులా, దయానిధియైన పాలకుడిగా, సానుభూతి నిండిన మంచి మనిషిగా ప్రజాక్షేమం కోసం అహర్నిశలు తపించే ప్రభువులా నటించడం మా విధి. సర్వ కాలాలలో నటించడం మనకి అవసరం. ఇది మన వంశపు ప్రారంభ దినాలనుండే వుందని మా అనుమానం. కాని కొన్ని రోజుల తర్వాత ఇలాంటి బృహత్తర బాధ్యతలు భయపెడతాయి. రోత పుట్టి స్తాయి. అంతమంది మనుషుల జీవితాలమీద మనకున్న అధికారం కలవరపెడుతుంది. నిద్ర పట్టనీయదు. ఆ తర్వాత అలవాటయి పోతుంది. ఈ ప్రపంచంలో వేలాది, లక్షలాది మంది మను షులు, వాళ్ళలో చాలా మందికి ఏమీ తెలియదు. మనము వాళ్ళ శ్రేయోభిలాషులమో, కీడోభిలాషు లమో అసలు తెలియదు. వాళ్ళు అమాయకులు కనుక మనం అందంగా స్వప్నాల మందిరాలని మాటలతో నిర్మిస్తే వాళ్ళు అందులో తలదా చుకుందామనుకుంటారు. వాళ్ళని నమ్మబలికేలా తియ్యగా, మానవత్వపు విలువల్ని కలగలిపి కాస్త కరుణరసం మిళాయించి, వారి బాధల్ని అర్థం చేసుకున్నట్టుగా నాలుగు మాటలు చెబితే చాలు. వారికి అదే పదివేలు. మన బాధ భరించలేక వాళ్ళే కన్నీళ్ళు కారుస్తారు. మన కల్లబొల్లి మాట లతో, కలల పంజరాలతో ఎండమావుల్ని చూపిస్తూ ఎన్ని శతాబ్దాలయినా వారిని అలా మభ్యపెట్ట వచ్చు. అలాగని మనం మభ్య పెట్టడమే వృత్తిగా పెట్టుకోవాలని నేను అనడం లేదు. నిజంగానే ప్రజల పరిస్థితి మీద మాకు ఎంతో సానుభూతి వుంది. నిజమైన బాధ వుంది. ఆ బాధ వెనుక అశక్తత వుంది. మన దేశాన్ని పాలిస్తున్నది నిజంగా మనం కాదు. ఆంగ్లేయులు. వారే నిజమైన ఏలి కలు. మనం డమ్మీలుగా, పవర్‌లెస్‌గా వున్నాము. ఎవడో రాజు దూరంగా ఇంగ్లండ్‌లో వుండి ఈ భూభాగాన్ని తన సేవకుల సహాయంతో పాలిస్తు న్నాడు. నిజమైన అధికారం వాళ్ళ చేతుల్లో వుంది. మమ్మల్ని వుంచడం, తీసివేయడం అంతా వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వుంటుంది. ఇంగ్లండ్‌లో వున్న రాజుకి మనమీద సరైన అవ గాహన వుందో లేదో మన కష్ట సుఖాలు అతడికి తెలుసో లేదో చెప్పడం కష్టం. ఆ కిరీటపు అధి కారం క్రింద వున్న ఎన్నో దేశాల్లో మనం కూడా ఓ చిన్న భాగం మాత్రమే. మనం నిజమైన అధి కారాన్ని ఎప్పుడో ఏవో కారణాల వల్ల పోగొట్టు కున్నాము. తిరిగి మనకి స్వాతంత్ర్యం వస్తుందో రాదో చెప్పడం చాలా కష్టం. ఆ గాంధీ ఏవో చేస్తు న్నారు కానీ అలాంటి కార్యక్రమాలతో ఈ దేశానికి స్వాతంత్ర్యం రావడం కల్ల అని మా అభిప్రాయం. అసలు మా జన్మ కాలంలో స్వాతంత్ర్యం మనకి వస్తుందన్న నమ్మకం మాకు లేదు. My son! I feel miserable! Terrible!!"

ఆ క్షణంలో నేను నా తండ్రిగారి పరిస్థితులు చూసి కొద్దిగా అర్థం చేసుకున్నాను. ఆయన విషా దానికి కారణాలుఉన్నావెంతో కాంప్లికేటెడ్. అవి చరిత్ర, ఆర్థిక, రాజకీయ సామాజిక పరిస్థితులతో, హ్యూమన్ డిగ్నిటీతో ముడిపడి వున్నాయని నాకు అనిపించింది.

"మేము ఏమి చేసినా అది ఓ విధమైన ఎస్కేప్ మాత్రమే. My son! నాకారులు, కంకుబైన్స్ గాంబ్లింగ్, యూరోప్‌లో తిరగడం ఇవన్నీ ఈ ఎస్కే ప్‌లో భాగాలే. మీరు సింహాసనానికి వారసులుగా వస్తే మీరు ఏమి చేస్తారో మాకు తెలియదు. కాని మీకు మేము ఇచ్చే సలహా ఒక్కటే. మీ జీవితాన్ని వృథా చేసుకోకండి, enjoy it"

**That was the lengthiest advice I ever got from anybody!**

"నాన్నగారూ నాకు ఓ విషయం అర్థం కాలేదు. మెక్ లారెన్ విజిట్‌కి కారణం తెలుసు. సర్వా సానం ఏమిటి?"

చార్మింగ్‌గా నవ్వారు మహారాజా.

"మీరు ఆ ప్రశ్న అడిగినందుకు మాకు చాలా ఆనందంగా వుంది యువరాజా. మీరు ఓ విషయం గుర్తుంచుకోవాలి. ఈ ప్రపంచం... అందులో ముఖ్యంగా ఈదేశం ఓ జంగిల్. అందులో రకరకాల జంతువులు తిరుగుతూ వుంటాయి. వాటిని వేటాడటానికి హంటర్స్ కూడా వుంటారు. జంతువులెవరో వేటగాళ్ళెవరో ఎవరికీ తెలియదు. ఈ రహస్యం తెలుసుకుంటే జీవితంలో ముఖ్యమైన సమస్య తీరుతుంది. ఆ పైన జీవించడం తేలిక. ప్రస్తుత సమస్య ఢిల్లీ నుండి నన్ను పదవీచ్యుతుణ్ని చేయాలని వచ్చాడు సర్ మెక్ లారెన్. అతడి ఆట కట్టాలి. ఎలా? రెండు మార్గాలు దొరికాయి. ఒకటి-అతడి భార్యకి నగల పిచ్చి. అది మనకు అనుకూలంగా మార్చుకోవడం ఒక మార్గం. రెండు-అతడు టైగ ర్‌ని వేటాడాలని ఆమె చిరకాల వాంఛ. స్కాలర్లీ డిప్లొమాట్ అన్నది అతని ఇమేజ్. అందువల్ల టైగర్

హంట్‌కి అతడి భార్య పోరు కీలకంగా పరిణమించింది. ఇవి రెండూ మనకి ఎడ్వాంటేజెస్. ఈ వేటలో మాకు జంతువు భూమికను ఢిల్లీ వారు నిర్ణయించారు. **shoot me down and put you on the throne! No I said, I'm not ready yet!!** అందువల్ల నేను వారి... టూడాను. మెక్ లారెన్‌కి టైగర్ లభించింది. లిడియా మెక్ లారెన్‌కి కా...సిన ఆభరణాలు లభించాయి. మోర్టిమర్ బ్రౌన్ చాలా మంచి ఆఫీసర్. **Very sincere** అంత మంచి ఆఫీసర్లు ఎవరూ అవసరం వుండదు. మాకు కావలసినది నే... చెప్పి... పని చేసిపెట్టే వాడు. బెస్ట్ సివిల్ సర్వెంట్స్ అంటే అర్థం వేరు. సమర్థతకీ, ఇతర విషయాలకీ ఏమాత్రం సంబంధం లేని అర్థం. నేను చెప్పినట్టుగా మోర్టిమర్ బ్రౌన్ ఎక్సలెంట్ ఆఫీసర్. అతడి రిపోర్టులలో ఏమీ అతిశయోక్తులు లేవు. ఆ రిపోర్టులు నిజమేనని ఒప్పుకోవడం వల్ల మనకి వచ్చిన నష్టం లేదు. కానీ ఢిల్లీలో కొనసాగుతున్న ఆంగ్ల ప్రభుత్వపు నిర్ణయాలలో మేము రెండు కీలకమైన మార్పులు చేశాము. మొదటిది మేము పదవిలో కొనసాగడం. రెండవది, ఇంకా ముఖ్యమైనది-మన సంస్థానం చిన్నది కావడం వల్ల దాని సమస్యలు తీర్చుకోవడానికి వచ్చే రెవెన్యూ చాలదు. ఆంగ్ల ప్రభుత్వం వారికి మనకి ఏ పదికోట్ల రూపాయలు అప్పు ఇస్తే ఆ డబ్బుతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు. మరి పరిపాలిస్తున్న పాప ప్రక్షాళన కోసం తమ ప్రజలకు ఆమాత్రం ధనసహాయం చేయడం ఆంగ్ల ప్రభువుల ధర్మం కాదా? అందువల్ల మన సంస్థానానికి కావలసిన ధనం వస్తుంది. దానితో కొద్దో గొప్పో మంచిపనులు చేయవచ్చు. మన సంస్థానపు రెవెన్యూతో పాటు మన కుటుంబం, మన బంధువులు, సిబ్బంది బ్రతకటం చాలా కష్టం. మనం దర్జాగా మరికొన్నేళ్ళు బ్రతకటానికి సరిపడా డబ్బు మిగుల్చుకోవచ్చు".

"చివరికి ...లో... అంటే ఈ వేటలో ఎవరు గెలిచారు నాన్నగారూ?"

చిరు సంకోచంతో అడిగాను.

వారు కాసేపు ఆలోచనలో మునిగిపోయారు. తేరుకుని మెల్లగా సమాధానమిచ్చారు

"ప్రస్తుతపు వేటలో అందరమూ విన్నర్స్. కాని ఇలా ఎన్నోసార్లు జరగదు. చాలాసార్లు వేటలు చాలా ఘోరంగా పరిణమిస్తాయి. మనుషులు, వారి ఆస్తులు, వారి ప్రాణాలు, వారి సర్వస్వమూ పోగొట్టుకుంటారు. ఇవి డెడ్లీ గేమ్స్. డేంజరస్ గేమ్స్. డయబాలిక్ హంట్స్. ఇక్కడ రాజ్యమేలే జంగిల్ న్యాయాలు చాలా భయంకరమైనవి. వాటిలోని నిర్దయ ఊహాతీతం. మీరు ఇలాంటి వేటల్లో ఎప్పుడూ విక్టిమ్ కాకూడదన్నది మా అభిమతం. ఈ గేమ్స్‌లో సాధారణంగా జిత్తులమారి నక్కలు తప్పించుకుంటాయి. నక్కలు ఎప్పుడూ తప్పించుకుంటాయి. అది వాటి జంతు లక్షణం. జాతి లక్షణం. ఏళ్ళతరబడి అరణ్యాలలో బ్రతికి బట్టకట్టడం వల్ల సిద్ధించిన ప్రకృతి వరం. ఇతర సాధు జంతువులు, అమాయక జంతువులు దెబ్బతింటాయి. చాలాసార్లు పులులు, సింహాలు కూడా దెబ్బ తింటాయి. కాని వేటగాళ్ళు వేటాడుతూనే వుంటారు. అది గేమ్ ఆఫ్ లైఫ్! గేమ్ ఆఫ్ డెత్! అల్టిమేట్ గేమ్. **Most exiting game! Most dangerous game!** మీకు ఈ రహస్యాలు తెలియాలి!"



ఫోటో : ఎ.వి. ఆనంద్, విజయవాడ

"థాంక్స్ నాన్నగారూ" అన్నాను.

నన్ను ఆశీర్వదించి వారు లోనికి వెళ్ళిపోయారు.

నేను కోట మీదికి వెళ్ళాను.

కోట ప్రహరీ చుట్టూ కందకాలు.

కోట లోపల ఎన్నో పాలెస్‌లు.

బయట ఎన్నో గ్రామాలు, చిన్న పట్టణాలు.

కోట బురుజుల మీదుగా ... దూరంగా వున్న పచ్చని పొలాల మీద ... దిక్చక్రపు సంపు దగ్గర సూర్యాస్తమయం జరుగుతోంది.

ఇంకా సేపట్లో చంద్రోదయం అవుతుంది.

అది సాయం సంధ్యా సమయం.....

నాకు అర్థం కాని కొత్త ఆటలు.... గేమ్స్... మారుతున్న రూల్స్... ఆ దారిలోని డేంజర్స్.... మరో ప్రక్కన నాకు రాబోతున్న బాధ్యతలు... మోర్ ఛాయిసెస్.... రాజ భూమికలోని క్లిష్టత... బాధ్యత. ... నన్ను చుట్టుముట్టి మళ్ళ పెడుతుండగా వేడెక్కిన మనసుతో నేను అస్తమిస్తున్న సూర్యుడి వంకకు చూస్తూ నిలబడ్డాను.

రవి అస్తమించని ఆంగ్ల రాజ్యంలో ఇరుక్కున్న నేను, మారే చరిత్రలో, మారని కొన్ని విలువలతో, ఎన్నటికీ మారని సామాజిక న్యాయాలతో, మారుతుందో లేదో తెలియని సంక్లిష్ట చరిత్ర సమయంలో, సరిగా స్పష్టంకాని రాజకీయ వాతావరణంలో... వేటలు... వేటగాళ్ళూ... విక్టిమ్స్... విన్నర్స్... రక్తం చిందటం... గెలుపు... ఓటమి... అన్నీ వుంటాయేమో మరి.

**But am I ready for the game?**

రక్త వర్ణపు సూర్యుడు పశ్చిమాద్రిన క్రుంగుతున్నాడు. ఆకాశమంతా బీభత్సంగా వుంది.

అప్పుడే నాకు ఓ ఊహ వచ్చింది.

బహుశా రాజులూ, రాజవంశాలూ, రాజ్యాలూ, ఆంగ్ల రాజ్యం కూడా అన్నీ చరిత్రలో కలిసిపోయే డైనోజార్స్ వంటివని.

నా వంక కు చూసుకున్నాను.

నేను కూడా డైనోజార్‌నే.

**It is the time for a new social order!**

ఇంతలో మోర్టిమర్ రొప్పుకుంటూ పరుగులాంటి నడకతో వచ్చాడు. అతడిలో ఉద్వేగం.

"అమర్... అమర్..." చెప్పలేక ఆగి రొప్పుతున్నాడు.

"ఏమిటి మోర్ట్?"

కొద్ది క్షణాలు తన శ్వాసను అదుపులోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేసి చివరికి అన్నాడు.

"ఢిల్లీ నుండి కాన్ఫిడెన్షియల్ టెలిగ్రామ్ వచ్చింది అమర్. రేపు ఉదయం వైస్రాయి ఆఫీసు నుండి ప్రత్యేక అధికారులు కూడా వస్తున్నారు."

"ఎందుకు?"

"బాడ్‌న్యూస్-మహారాజా వారిని డిపోజ్ చేయమని ఆజ్ఞ. గుడ్ న్యూస్–ఆ స్థానంలో మీ పట్టాభిషేకం. రేపే."

పిడుగు పడినట్టయింది.

నేను మాట్లాడకుండా వుండిపోయాను.

"రేపటి నుండి నేను మీతో ఫెమిలియర్‌గా వుండడానికి వీలు లేదు. మీకు ముఖ్య విషయాలలో బ్రీఫింగ్ ఇవ్వాలి. క్రిందకి వెళదామా యువర్ హైనెస్!"

యాంత్రికంగా నడిచాను.

పులిబోనులోనికి పోతున్న మేకలాగా

తెలియని భవిష్యత్తునేపుకి....

నాకు పదవి అధికారం నేపుకి....

రాజకీయ, చారిత్రక సంఘర్షణల నేపుకి....

మోయలేని బాధ్యతల బరువు నేపుకి.....

డేంజరస్ గేమ్ ప్రారంభం కాబోతోంది.

వేడెక్కిన బుర్రతో క్రిందకి దిగాను.

గుడ్‌బై మనశ్శాంతి

గుడ్‌బై ఫ్రీడమ్

గుడ్‌బై అమాయకత్వం

గుడ్‌బై! గుడ్‌బై!!